NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.com
http://nirbhayavaartha.com

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY

**విలేకరులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న "నిర్భయవార్త" తెలుగు దినపత్రికకు జర్నలిజంపై ఆసక్తి కలిగి, అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సి ఇంచార్జ్‌లు మండలాల వారిగా విలేకరులు కావలెను.
సంప్రదించండి
సెల్ : 7799013939

సంపుటి :12 సంచిక :309 రంగారెడ్డి | బుధవారం 04 మార్చి 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00
Circulated To : ★ Hyderabad ★ Ranga Reddy ★ Nizamabad ★ Warangal ★ Mulugu ★ Shadnagar ★ Yadadri ★ Nalgonda ★ Karimnagar ★ Khammam ★ Medak ★ Sangareddy ★ Siddipet ★ Medchal ★ Jagityal ★ Vemulawada

# రాజ్యసభ అభ్యర్థులపై ఉత్కంఠ..

**ప్రతిపాదనలతో ఢిల్లీకి వెళ్లనున్న సీఎం రేవంత్, మహేష్ గౌడ్**
**ఢిల్లీ రావాలని సీఎంకు రాహుల్ గాంధీ సూచన**
**ఒక స్థానంలో సింఘ్వీ పేరు దాదాపు ఖరారైనట్లు ప్రచారం**
**రెండో సీటు ఎవరికి దక్కుతుందనే దానిపై కొనసాగుతున్న ఉత్కంఠ**



హైదరాబాద్, మార్చి 03 నిర్భయవార్త ప్రతినిది : తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభకు ఎవరిని పంపాలనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. అభ్యర్థులను ఖరారు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బుధవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. పార్టీ అధిష్ఠానంతో చర్చించి రెండు స్థానాలకు పేర్లను ఖరారు చేయనున్నారు. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ప్రతిపాదనలతో ఢిల్లీకి రావాలని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. సోమవారం శంషాబాద్ విమానాశ్రయం లాంజ్‌లో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్, కేసీ వేణుగోపాల్, మహేశ్ కుమార్ గౌడ్‌ల మధ్య ఈ విషయంపై ప్రాథమికంగా చర్చ జరిగింది. రాష్ట్రం నుంచి రెండు రాజ్యసభ స్థానాలు కాంగ్రెస్‌కు దక్కనుండగా, అందులో ఒక సీటు1ను సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీకే తిరిగి కేటాయించాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో రెండో స్థానం ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. దీనిపై బుధవారం జరిగే సమావేశంలో పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఖమేనీ మృతిపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించిన సోనియా గాంధీ



న్యూఢిల్లీ, మార్చి 03 నిర్భయవార్త : కేంద్ర సర్కారు వ్యవహార శైలిపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ అసహనం వ్యక్తం చేశారు. ఇరాన్ సుప్రీంనేత అయతుల్లా అలీ ఖమేనీ మృతి కేసులో మోదీ ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడాన్ని సోనియా తప్పుపట్టారు. ఇరాన్ అంశంలో భారత్ ప్రదర్శించిన మౌనం తటస్థంగా ఉండడం కాదు అని, అది పరిత్యాగం చేసినట్లుగా ఉందని సోనియా ఆరోపించారు. భారతీయ విదేశాంగ విధానంపై విశ్వసం కోల్పోయినట్లుగా ఉందని ఆమె అన్నారు. విదేశీ విధానం అంశంలో భారత్ వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరంగా ఉన్నట్లు కూడా ఆమె చెప్పారు. అయితే రెండో దఫా బడ్జెట్ సమావేశాల కోసం పార్లమెంట్ ప్రారంభమైనప్పుడు.. భారత్ తీసుకున్న తన నిర్ణయం పట్ల చర్చ చేపట్టాలని సోనియా డిమాండ్ చేశారు. ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో సోనియా తన వ్యాసాన్ని ప్రచురించారు. ఆ వ్యాసంలో ఆమె ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఖమనీ మృతిచెందినట్లు మార్చి ఒకటో తేదీన ఇరాన్ ధ్రువీకరించిందని, వైమానిక దాడుల్లో ఖమేనీ ప్రాణాలు కోల్పోయారని, ఒకవైపు చర్చలు నిర్వహిస్తూనే మరో వైపు దేశ అధినేతను చంపడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. ఇలాంటి షాకింగ్ ఘటన జరిగినప్పుడు భారత్ వ్యవహరించిన తీరు మరింత షాకింగ్‌గా ఉందని ఆమె అన్నారు. ఖమేనీ హత్య గురించి కానీ, ఇరాన్ సార్వభౌమత్వాన్ని దెబ్బ తీసే అంశం గురించి కానీ భారత ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడాన్ని సోనియా ఖండించారు.



# అణు భయం!

## వణికిపోతున్న ప్రపంచం

**ఇరాన్ యుద్ధంలో ఒక్క అణుబాంబు పేలినా అంతే సంగతులు**

**అగ్రరాజ్యాల మధ్య ఇబ్బడిముబ్బడిగా అణ్వాయుధాలు**

**భూ మండలం నాశనం కావడానికి వంద అణుబాంబులు చాలు**

## సర్వమానవాళి కనుమరుగయ్యే ప్రమాదం

ఈ భూమి మీద పచ్చని ప్రకృతిని ఇచ్చాడు దేవుడు. అందరూ ఫలాలను అందుకుని ఫలితాలని పొందుతూ ఆనందంగా ఉండాలని దీవించాడు. కానీ 84 లక్షల జీవ రాశులలో తెలివైన జీవి మనిషి మాత్రం విధ్వంశం వైపుగానే అడుగులు వేస్తున్నాడు. ఎందుకంటే మనిషిని మెదడు ఉంది. ఆ మెదడుతో మంచి ఆలోచనలు చేయవచ్చు. కానీ స్వార్ధం నిండుగా ఉన్న మనిషి వినాశనం వైపుగా చూస్తున్నాడు. అందుకే యుద్ధాలు కోరుకుంటున్నాడు. దాని కోసం అణు బాంబులను నమ్ముకుంటున్నాడు. ప్రత్యర్థి ప్రాంతం నశిస్తే తాను బాగుంటాను అనుకుంటున్నాడు, కానీ అణు బాంబు అలాంటిది కాదు వేసిన వాడినీ మట్టుపెట్టేస్తుంది. ప్రస్తుతం ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ సాగిస్తున్న సమరంలో ఒక్క అణు బాంబు పేలినా మొత్తం గల్ఫ్ దేశాలన్ని ధ్వంసంకావడం ఖాయం.. ఆ ఒక్క అణుబాంబుతో ప్రారంభమైన ఈ అణుయుద్ధం మరికొన్ని అణుబాంబులకు ప్రయోగానికి ప్రేరణ ఇస్తుంది.. దీంతో మొత్తం ప్రపంచ మానవళి నాశనం అవుతుందని భయాలు వ్యక్తమవుతున్నాయి.

### భూమి భస్మీపటలం

ఈ రోజున అనేక దేశాల వద్ద అణు బాంబులు ఉన్నాయి. వాటి మొత్తం సంఖ్య ఏకంగా 12 వేలు అని ఒక అంచనా ఉంది. రష్యా వద్ద 5459 అణు బాంబులు ఉంటే అమెరికా వద్ద 5277, చైనా వద్ద 600, ఫ్రాన్స్ వద్ద 290, యూకే వద్ద 225, భారత్ వద్ద 180, పాకిస్థాన్ వద్ద 170, ఇజ్రాయెల్ వద్ద 91, ఉత్తర కొరియా వద్ద 50 ఉన్నట్లుగా ఒక అంచనా. ఇలా వేలాదిగా ఉన్న అణు బాంబులు ప్రపంచానికి ఎంతో ప్రమాదం అని అంటున్నారు.

### 100 అణు బాంబులు

ఇక భూమి సర్వ నాశనం కావడానికి వందంటే వంద అణు బాంబులు చాలు అని అంటున్నారు నిపుణులు. అలా వంద అణు బాంబులు పడితే కనుక ఈ భూమి అన్నదే ఉండదు. మరి 12 వేల అణు బాంబులు అంటే సౌర వ్యవస్థలో సగానికి సగం భస్మీపటలం అయిపోతుంది అంటున్నారు. దీన్ని బట్టి చూస్తే అణు బాంబుల నిల్వాలు ఎంత డేంజర్ అన్నది అర్థం అవుతోంది కదా. కానీ రక్షణ పేరుతో ఏ దేశానికి ఆ దేశం పోగు చేసుకుంటోంది. ఈ రోజు ఇరాన్ మీద యుద్ధం చేయడానికి కారణం అణు ఆయుధాలు ఆ దేశం తయారు చేస్తోంది అన్న అనుమానంతోనే అని అంటున్నారు.

# నలుగురు బిసి నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారు: మహేష్ గౌడ్



హైదరాబాద్, మార్చి 3 నిర్భయవార్త ప్రతినిధి : రాజ్యసభ స్థానాలపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమర్థవంతమైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి ఒకరికి ఇస్తారా? లేదా ఇద్దరికి ఇస్తారా అనేది బుధవారం తెలుస్తుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యసభ స్థానం కోసం అడగడం లేదని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశాలు ఇచ్చిందని విమర్శించారు. తెలంగాణ కోసం పనిచేసిన వారిలో ఒక్కరికైనా బీఆర్ఎస్ రాజ్యసభ ఛాన్స్ ఇచ్చిందా? అని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. మార్చి నెలలో కొన్ని కార్పొరేషన్ పదవులు ఇస్తామని, ప్రస్తుతం వాటిపై కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ తెలిపారు. పినరయి విజయన్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం ఇచ్చారని చెప్పారు. రాజకీయాల కోసమే విజయ్ మాట్లాడుతున్నారని, కేరళంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన వెల్లడించారు.

మావోయిస్టులు వస్తే ఆహ్వానిస్తాం..

నమ్ముకున్న సిద్ధాంతం కోసం మావోయిస్టులు దశాబ్దాలుగా పనిచేశారని టీపీసీసీ చీఫ్ చెప్పుకొచ్చారు. ఆపరేషన్ కగార్‌ను తాము వ్యతిరేకించామని తెలిపారు. పాకిస్థాన్‌తో చర్చలకు ఒప్పుకున్న మోదీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదని విమర్శించారు. వారి సిద్ధాంతంతో తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజల కోసం పోరాడిన వారిపై గౌరవం ఉంటుందని చెప్పారు. తామైనా, మావోయిస్టులయినా పేద ప్రజల కోసమే పోరాటం చేశామని.. లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# తెలంగాణ హైకోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు




హైదరాబాద్, ఫిబ్రవరి 03 నిర్భయవార్త ప్రతినిది : తెలంగాణ హైకోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు రావడంతో తీవ్ర కలకలం రేగింది. ప్రోటోకాల్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. వెంటనే అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కోర్టు పరిసరాలను ఖాళీ చేయించి తనిఖీలు ప్రారంభించారు. బాంబు స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు రంగంలోకి దిగి ప్రతి మూలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాయి. వారం రోజుల వ్యవధిలో రెండోసారి బాంబు బెదిరింపు రావడం గమనార్హం. ఇటీవల కూడా ఇలాంటి ఈ-మెయిల్ రావడంతో భద్రతా చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. తెలంగాణ కోర్టులను లక్ష్యంగా చేసుకుని తమిళనాడు పేరుతో ఈ-మెయిల్ పంపినట్లు సమాచారం. ఈ-మెయిల్ మూలాన్ని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం హైకోర్టు ప్రాంగణంలో భద్రతను మరింత పెంచి, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచారు.

# హోలీ పండుగ శుభాకాంక్షలు: కేసీఆర్



హైదరాబాద్,ఫిబ్రవరి 03 నిర్భయవార్త ప్రతినిది : దేశవ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో ఆనందం, ఐక్యత, కొత్త ఆశలు నిండాలని ఆకాంక్షించారు. ప్రేమాభిమానాలను విరజిమ్మే రంగుల పండుగగా భారతీయ సంప్రదాయంలో హోలీ ప్రత్యేకతను సంతరించుకున్నదని అన్నారు. ఇది సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తుందని ఆకాంక్షించారు.

నిర్భయవార్త

సంపాదకీయం

బుధవారం 04, మార్చి 2026

## ప్రపంచాన్ని తుపాకీతో బెదిరించి...

వారు ఎప్పుడూ నేర్చుకోరు, ఎప్పటికీ మారరు. ఒక సార్వభౌమిక దేశాన్ని దుర్బలం చేసేందుకు కలహాశీల అమెరికా అధ్యక్షుడు ఒకరు మరోసారి విధ్వంసక దాడులకు పూనుకున్నారు. తన చర్యను సమర్థించుకునేందుకు పచ్చి అబద్ధాలు, సత్యదూర వాదనలు ప్రచారం చేస్తున్నారు. ఆ దౌర్జన్యాన్ని ముందస్తుగా సంకల్పించారు, ఆ దుష్ట సంకల్పం ప్రపంచానికి వెల్లడి కాకుండా మోసపూరిత శాంతి చర్చల తంతు జరిపారు. సంయమనం వహించాలన్న మిత్రదేశాల సలహాను పాటించలేదు. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయ నియమాలు, ప్రజాభిప్రాయాన్ని నిర్లక్ష్యం చేశారు, మరోసారి ఆ సార్వభౌమిక దేశంపై అత్యాధునిక విధ్వంసక ఆయుధాలతో విరుచుకుపడ్డారు. గతంలో వలే ఇప్పుడు కూడా అమెరికా దౌర్జన్య చర్య ఫలితం ఊహించలేనిదేమీ కాదు: ఇరాన్‌కు వ్యతిరేకంగా విస్తృతస్థాయిలో మళ్లీ ప్రారంభమైన అమెరికా--ఇజ్రాయెల్ దాడి మహా విధ్వంసంతో అల్లకల్లోలాన్ని సృష్టించింది. పరిస్థితులను ఇంకా భయానకం చేస్తోంది, అంతర్జాతీయ చమురు విపణి కుదేలయిపోతోంది. టెహ్రాన్ పాలకుల మద్దతు ఉన్న హెజ్బొల్లా, హౌతీ సాయుధ బృందాలు రంగంలోకి దిగడంతో కొత్త విద్వేషాలు రగుల్కొంటాయి, ఉగ్రవాద ప్రతీకారాలు విజృంభిస్తాయి. పాశ్చాత్య ప్రపంచ విరోధులు మాత్రమే పరమానందం పొందుతారు. సార్థక ఫలితాలు ఏవైనా సమకూరుతాయా? అసాధ్యం. అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌లలో అమెరికా నేతృత్వాన పాశ్చాత్య దేశాల జోక్యపు చేదు ఫలితమే ఇప్పుడూ ఇరాన్‌లో చూడబోతున్నాం. అఫ్ఘాన్, ఇరాక్‌లలో జోక్యాలు క్షమించరానివి! ఆ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోనేలేదు. ప్రపంచాన్ని తుపాకీతో బెదిరించి తాను నిర్దేశించినట్టు నడిచేలా చేయగలనని 21వ శతాబ్ది ప్రజలు ఎన్నుకున్న అమెరికా అధ్యక్షుడు ఒకరు విశ్వసించడం విస్మయకరం! నైతిక వివేచన పూర్తిగా కొరవడిన నిర్ణయ ఫలితమే ఇరాన్‌పై దాడి. జార్జి బుష్ హయాంలో 2003లో ఇరాక్ దురాక్రమణ, ఇప్పుడు ఇరాన్‌పై భీకర దాడులు రెండూ ఒకే విధమైనవి. ఇతర దేశాలలో అమెరికా జోక్యాలు-- వియత్నాంలోనూ, 1953లో సీఐఏ ఆధ్వర్యంలో జరిగిన పాలన మార్పు రెండూ అంతిమంగా విఫలమయ్యాయి. ఆ వైఫల్యాలకు అమెరికా భారీ మూల్యమే చెల్లించవలసి వచ్చింది. విదేశాలలో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని నివారిస్తానని ట్రంప్ వాగ్దానం చేశారు. అది కల్తీలేని బొంకుమాట. ప్రపంచ దేశాలతో అమెరికా సంబంధాల తీరుతెన్నులను ట్రంప్ మార్చివేయగలరని విశ్వసిస్తున్నవారు 1945 అనంతరం సామ్రాజ్యవాద దురహంకారంతో అది పాల్పడిన నీతిబాహ్య చర్యలను ఓసారి సమీక్షించండి. పూర్వపు అధ్యక్షులకు ట్రంప్ భిన్నమైన వ్యక్తి కాదు. జనవరిలో వెనెజువెలా అధ్యక్షుడిని అరెస్ట్ చేసి తీసుకువెళ్లిన తరువాత ఆ దేశంలోని చమురు సంపద మాత్రమే తనకు అవసరమని ట్రంప్ అన్నారు. అయితే ఆ తరువాత ఇతర విషయాలలో సంభవిస్తున్నది గమనిస్తే అమెరికా సామ్రాజ్యవాద జోక్యాల తుచ్ఛ చరిత్రకు భిన్నంగా లేదని అర్థమవుతుంది. జార్జి బుష్ మాదిరిగానే డొనాల్డ్ ట్రంప్ సైతం అబద్ధాలే పునాదిగా ఒక సంక్షోభాన్ని సృష్టించారు. బుష్, ఆయన సహ నేరస్థుడు టోనీ బ్లెయిర్ వలే ట్రంప్ సైతం ఉద్దేశపూర్వకంగా ఇరాన్ నుంచి సంభావ్య ముప్పును గోరంతలు కొండంతలు చేశారు. దీర్ఘ శ్రేణి క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేస్తోందని, వాటివల్ల యూరోపియన్ దేశాలలోని అమెరికా బలగాలకు ముప్పు ఏర్పడవచ్చని, ఆ క్షిపణులు అమెరికా భూభాగాలకు కూడా చేరగలవని పదే పదే చెప్పారు. సద్దాం హుస్సేన్ కల్పిత ఆయుధాల విషయంలో బుష్ ప్రభృతులు చేసినటువంటి తప్పుడు ప్రచారాన్నే ఇరాన్ విషయంలో ట్రంప్ చేశారు. ఇరాన్ దాడులకు సిద్ధమైనందునే తాము ముందస్తు దాడులు చేశామన్న ఇజ్రాయెల్ వాదనలో సత్యం ఏ మాత్రం లేదు. గత ఏడాది జూన్‌లో అమెరికా--ఇజ్రాయెల్ మొదటి సంయుక్త దాడి అనంతరం నెలకొన్న శాంతియుత పరిస్థితులను పరిరక్షించుకునేందుకే ఇరాన్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. అణ్వాయుధాల తయారీ సామర్థ్యాన్ని సైతం ఇరాన్ వేగంగా సమకూర్చుకుంటోందని ట్రంప్ చేస్తున్న వాదనను గత ఇరవై ఏళ్లుగా ఇరాన్ పాలనావ్యవస్థ సర్వోన్నత అధినేత మొదలు జూనియర్ మంత్రి దాకా ప్రతి ఒక్కరూ ఖండిస్తూ వస్తున్నారు. 'తాము ఎట్టి పరిస్థితులలోనూ అణ్వాయుధాన్ని అభివృద్ధి పరచబోమని' ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అర్ఘాషి నిన్నగాక మొన్న స్పష్టంగా ప్రకటించారు. దీనిపై వాద ప్రతివాదాలు జరిగాయి. అయితే ఇరాన్ అణ్వాయుధాల తయారీలో పురోగతి సాధించినట్టు ఎటువంటి రుజువులను అమెరికా, ఐక్యరాజ్యసమితి అధికారులుగానీ నెతన్యాహు గానీ ప్రపంచానికి వెల్లడించలేకపోయారు. 'అమెరికా ప్రజాస్వామ్యానికి, ప్రపంచ భద్రతకు ట్రంప్ ఒక పెనుముప్పుగా పరిణమించారు' అని బరాక్ ఒబామా పాలనలో జాతీయ భద్రతా వ్యవహారాలలో కీలక బాధ్యతలు నిర్వహించిన బెన్ రోడెస్ వ్యాఖ్యానించారు. మన ఆధిక్యతను అంగీకరించని, మన మార్గాన్ని అనుసరించేందుకు సుముఖంగా లేని దేశాలను లొంగదీసుకోవాలని అమెరికన్ ఆదర్శాలు పురిగొల్పుతాయా? అని రోడెస్ విస్మయం వ్యక్తం చేశారు. ఇతర దేశాల కంటే అమెరికా స్వాభావికంగా ప్రత్యేకమైనది, విభిన్నమైనది, ఉన్నతమైనదని ప్రవచించే అమెరికన్ అసాధారణవాదానికి ఈయనొక వ్యక్తీకరణ. అయితే ఆ అసాధారణ వాదం ఒక మిథ్యా విశ్వాసమే. ఇరాన్‌పై దాడికి సర్వసన్నాహాలు చేస్తూనే ట్రంప్ ఆ దేశంతో రెండోసారి చర్చలు జరిపారు! జెనీవాలో జరిగిన ఆ చర్చలు ఎంత ప్రహసనప్రాయమైనవో ఇప్పుడు తేటతెల్లమయింది. తమ లక్ష్యాలను వెన్వెంటనే గరిష్ఠంగా సాధించుకోవడానికి సమష్టిగా పూనుకున్న ట్రంప్, నెతన్యాహులు ఇరాన్‌పై భీకర దాడులను ఇప్పట్లో నిలిపివేయడం జరగనిపని. 1979 ఇరానియన్ విప్లవంలో అమెరికాకు ఎదురైన అవమానాలకు అంతిమంగా ప్రతీకారం తీర్చుకున్న అధ్యక్షుడుగా చరిత్రలో నిలిచిపోవాలని ట్రంప్ అభిలషిస్తున్నారు. ఇరాన్‌ను తిరిగి పాశ్చాత్య ప్రపంచబాటలోకి తీసుకురావడంతో పాటు ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న కాంగ్రెస్ ఎన్నికలలో ఓటర్ల మద్దతును మళ్లీ కూడగట్టుకోవడమే ట్రంప్ లక్ష్యం. తన రేటింగ్‌ను అతివేగంగా, గణనీయంగా పునరుద్ధరించుకునేందుకు ఆయన ఆరాటపడుతున్నారు. ఇరాన్‌ను చావు దెబ్బతీసి తమ నయా వలసవాదానికి అనుగుణంగా ఇజ్రాయెల్ మనుగడకు శాశ్వత రక్షణ సమకూర్చుకోవడం నెతన్యాహు లక్ష్యం. ఇరాన్‌లో అమెరికా--ఇజ్రాయెల్‌ల అనాలోచిత, ప్రమాదకర జోక్యం ఎలా ముగుస్తుందో ఊహించలేం. అయతొల్లా ఖమేనీ, ఆయన సన్నిహిత సహచరులు, వారసులు ఎందరు మరణించినప్పటికీ ఇరాన్ పాలనా వ్యవస్థ ఇప్పటికిప్పుడు పూర్తిగా కూలిపోవడమనేది అసంభవం. మతపరమైన విధానాల ప్రాతిపదికన నడిచే ఇరాన్ పాలనా వ్యవస్థ కొనసాగుతుంది. అది దేశీయంగా, అంతర్జాతీయంగా మరింత పెనుసవాళ్లను విసిరే అవకాశమూ ఉన్నది. ఇరాన్‌ను పనిచేసే ప్రజాస్వామ్యంగా మార్చివేసేందుకు ప్రస్తుత విధ్వంసక దాడులు దోహదం చేయవు.

# అసమానతల యుగంలో మీడియా




లక్నో 'జన్ విచార్ మంచ్' ఇటీవల నిర్వహించిన సదస్సులో ప్రఖ్యాత పాత్రికేయుడు, రచయిత పి.సాయినాథ్ ప్రసంగించారు. సాయినాథ్ తన ప్రసంగాన్ని 2024లో జరిగిన అనంత్ అంబానీ వివాహంతో ప్రారంభించారు (వివరాలు సంక్షిప్తంగా). ఆ వివాహానికి రూ. 5,000 కోట్లు ఖర్చు చేశారు. ప్రధానమంత్రి, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, సినీతారలు, అధికారులు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. మరోవైపు, మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మూడు లక్షల మంది రైతు కుటుంబాలకు చెందిన కుమార్తెలకు వివాహం చేయడం సాధ్యం కాలేదు. అంబానీ వివాహంపై చేసిన ఖర్చు ఒక వ్యాపార పెట్టుబడి మాత్రమేనని, ఇది ఆయన సంపదలో కేవలం 0.27 శాతం మాత్రమేనని, దానిని ఆయన ఒక సంవత్సరంలోనే సులభంగా రాబట్టుకున్నారని సాయినాథ్ పేర్కొన్నారు. రాజకీయ నాయకులు, సీనియర్ అధికారులు హాజరైన ఇలాంటి హై-ప్రొఫైల్ పెళ్లిలో అడవులు, ఖనిజాలు లేదా ప్రజా సంస్థలకు సంబంధించిన కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం సహజం. అంబానీ వివాహ వార్తలు నెలల తరబడి మీడియా శీర్షికల్లో నిండిపోయినప్పటికీ, విదర్భ రైతుల దుస్థితి గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. రైతుల ఆత్మహత్యలకు ఒక ముఖ్య కారణం వారి కుమార్తెలకు పెళ్లి చేయలేకపోవడమేనని ఒక సర్వే సూచించింది. విలాసవంతమైన ఆ వివాహాన్ని లేదా రైతుల ఆత్మహత్యలను ఏ మీడియా సంస్థ విమర్శించలేదు. నేడు, మనం ఆర్థిక, సామాజిక, న్యాయ, భాష, లింగ ఆధారిత అసమానతలు తీవ్రమైన దశలో వున్నాం. "చట్టం ముందు అందరూ సమానమే" అనే భావన కేవలం సిద్ధాంతపరమైన ప్రకటన మాత్రమే! అర్ణబ్ గోస్వామి 24 గంటల్లోనే బెయిల్ పొందారు కానీ కేరళకు చెందిన పాత్రికేయుడు సిద్ధిఖ్ కప్పన్ హత్రాస్ కేసును కవర్ చేసినందుకు రెండున్నర సంవత్సరాలు జైలులో ఉన్నారు. కోవిడ్ సమయంలో అనారోగ్యానికి గురైనప్పుడు అతన్ని మథురలోని ఆసుపత్రి మంచానికి గొలుసులతో బంధించారు. లఖింపూర్ ఖేరీలో ఒక మంత్రి కుమారుడు తేనీ, తన కారుతో ఐదుగురు రైతులతో సహా తొమ్మిది మందిని చంపి, ఇప్పుడు బెయిలుపై బయట ఉన్నాడు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు "బెయిల్ నియమం, జైలు మినహాయింపు" అని చెప్పినప్పటికీ ఉమర్ ఖాలిద్ ఐదు సంవత్సరాలుగా విచారణ లేకుండా జైలులో ఉన్నాడు. నేడు, ఒక పోలీస్ కానిస్టేబుల్ కూడా సుప్రీంకోర్టు కంటే ఎక్కువ శక్తివంతంగా కనిపిస్తున్నాడు. 1991 నుండి దేశంలో ఆర్థిక అసమానత నిరంతరం పెరుగుతోంది. 1990లో బిలియనీర్లు (శత కోటీశ్వరులు) ఎవరూ లేరు. 2024 నాటికి, 211 మంది బిలియనీర్లున్నారు, వీరి సంపద దేశ జిడిపిలో 26 శాతం ఉంది. వారి మొత్తం సంపద రైతుల బడ్జెట్ కంటే 62 రెట్లు ఎక్కువ. కుల ఆధారిత అసమానత గురించి మాట్లాడుతూ, 90 శాతం మంది బిలియనీర్లు ఉన్నత కులాలకు చెందినవారేనని సాయినాథ్ ఎత్తిచూపారు. కోవిడ్ మహమ్మారి సమయంలో 90 శాతం మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు, 24 మంది కొత్త బిలియనీర్లు ఉద్భవించారు. ముఖ్యంగా ఫార్మా, ఆరోగ్య సంరక్షణ రంగాల నుండి. ఫోర్బ్స్ పత్రిక ప్రకారం, భారతదేశం బిలియనీర్ల సంఖ్యలో మూడవ స్థానంలో ఉంది. కానీ మానవాభివృద్ధి సూచీలో 134వ స్థానంలో ఉంది. అంటే జనాభాలో ఒక్క శాతం మంది దేశ జాతీయ ఆదాయంలో 22.6 శాతం నియంత్రిస్తున్నారని దీని అర్థం. బ్రిటిష్ పాలనలో కూడా, సంపద అంతరం ఇంత ఎక్కువగా లేదు. స్వాతంత్ర్యోద్యమం కూడా ఇటువంటి అసమానతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమే. ఎన్నికల సంస్కరణలపై ఎడిఆర్ సంస్థ నివేదిక ప్రకారం, పార్లమెంటులోని 543 మంది ఎంపీలలో 2004లో 30 శాతం మంది కోటీశ్వరులు; 2009లో 58 శాతం; 2014లో 88 శాతం; 2024లో 93 శాతం మంది ఉన్నారు. వీరిలో 42 శాతం మంది రూ. 10 కోట్లకు మించిన ఆస్తులు కలిగిన కోటీశ్వరులు. కాగా వీరంతా దేశంలోని పేదలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటారు. ప్రతిపక్ష పార్టీలకు నిధులు సమకూర్చే వారికి జైలు శిక్ష పడే ప్రమాదం ఉన్నందున, ప్రభుత్వం వాటికి నిధులను పరిమితం చేసింది. ఎలక్టోరల్ బాండ్ల పథకం బండారం కూడా బట్టబయలైంది. కష్టపడి పనిచేస్తే ఎవరైనా అంబానీ కావచ్చని తరచుగా అంటుంటారు కానీ ఈ దేశంలోని శ్రామిక మహిళల కంటే ఎవరు ఎక్కువగా శ్రమిస్తారు? ప్రపంచవ్యాప్తంగా శ్రామిక మహిళలు ప్రతిరోజూ మొత్తం 12.5 బిలియన్ గంటల చెల్లించని పని చేస్తున్నారని, దీని విలువ 10.8 ట్రిలియన్ డాలర్లు (సుమారు 980 లక్షల కోట్ల రూపాయలు) అని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) నివేదికను సాయినాథ్ పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా ఎలన్ మస్క్ త్వరలో 1 ట్రిలియన్ డాలర్లు సంపాదిస్తారని అంచనా. ఇది లింగ అసమానత్వాన్ని ప్రతిబింబిస్తుంది. దీనిని ఆక్స్‌ఫామ్ మూడు స్థాయిల్లో (కులం, వర్గం, లింగం) వివక్షగా గుర్తించింది. అంబానీ సంపదతో సమానమైన సంపదను సాధించాలంటే, ఒకరు 5,090 సంవత్సరాలకు పైగా పని చేయాల్సి ఉంటుంది. మహిళల కోసం ప్రభుత్వ పథకాలలో కూడా కార్పొరేట్లు జోక్యం చేసుకుంటున్నాయి. ఇటీవల బీహార్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మహిళలకు రూ. 10,000 ఇస్తామని హామీ ఇచ్చిన సంగతిని గుర్తు చేస్తూ, ఈ డబ్బు ఎక్కడి నుండి వస్తుందని ఆయన ప్రశ్నించారు. అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, బాల్వాడీ వంటి మహిళా కార్యక్రమాల నుండి నిధులు మళ్లించబడుతున్నాయి. అక్షయ పాత్ర మధ్యాహ్న భోజన పథకంలోకి ప్రవేశించి, 2.4 మిలియన్ల పిల్లలకు సాత్విక ఆహారం అందిస్తున్నట్లు చెప్పుకుంటోంది. ఒడిశాలో వేదాంత గ్రూప్ అంగన్వాడీలను నిర్వహిస్తోంది. అదే సమయంలో అదానీ నవీ ముంబైలో అంగన్వాడీలను నిర్వహిస్తోంది. లక్షల కోట్లను కాజేసి, చిన్న మొత్తాలను అందజేస్తున్నారని, ప్రభుత్వం తన బాధ్యతలను తప్పించుకుంటోందని ఇది చూపిస్తుంది. రైతు ఉద్యమాన్ని గత 30 ఏళ్లలో ప్రపంచంలోనే అతిపెద్ద ఉద్యమంగా సాయినాథ్ అభివర్ణించారు. న్యాయం కోసం డిమాండ్ చేస్తూ 52 వారాల పాటు సాగింది, లాభాల కోసం పనిచేసే కార్పొరేట్లను బహిరంగంగా సవాలు చేసింది. అయినప్పటికీ ఇది మీడియా కవరేజీలో ఎక్కువగా లేదు. మహమ్మారి సమయంలో కూడా ఢిల్లీ సరిహద్దుల్లో ఎండ, వాన, చలిని తట్టుకుంటూ బస చేశారు. ఫలితంగా 720 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. ట్రంప్ సుంకాల గురించి మీడియా ప్రజలను తప్పుదారి పట్టించే అంశంపై, ఆయన మహారాష్ట్ర ఉదాహరణను పేర్కొన్నారు. పత్తి రైతులు తమ ప్రయత్నాల ద్వారా క్వింటాల్‌కు రూ. 8,125 ఎంఎస్పి పొందగలిగారు కానీ ట్రంప్ సుంకాలు విధించిన తర్వాత ప్రభుత్వం పత్తిపై ఎక్సైజ్ డ్యూటీ ఉపసంహరించుకోవడంతో ధరలు పడిపోయాయి. సోయాబీన్ రైతులు కూడా తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. తోలుపై సుంకాల కారణంగా తమిళనాడులోని చిన్న చర్మ శుద్ధి కర్మాగారాలు మూతపడతాయి. వీటిలో చాలా దళితుల యాజమాన్యంలో ఉన్నవే. ప్రభుత్వ వాదనను ప్రతిధ్వనిస్తూ మీడియా సుంకాలపై ప్రజలను తప్పుదారి పట్టిస్తుంది. మీడియాపై కార్పొరేట్ నియంత్రణ గురించి మాట్లాడుతూ, 2023లో మీడియా పరిశ్రమ విలువ రూ. 1.4 ట్రిలియన్లుగా ఉన్నది 2025కి రూ. 2.7 ట్రిలియన్లకు పెరుగుతుందని అంచనా వేయబడిందని సాయినాథ్ తెలిపారు. అంబానీకి చెందిన జియో డిస్నీ హాట్‌స్టార్‌తో విలీనం కావడంతో ఈ పెరుగుదల సంభవించింది. నేడు, జర్నలిజం క్షీణిస్తోంది. దాని స్థానంలో మీడియా వస్తోంది. జర్నలిజం ప్రజల స్వరాన్ని ప్రతిబింబించడం లక్ష్యంగా పెట్టుకోగా, మీడియా లాభం కోసం ఉంది. నేటి జర్నలిస్టులు తరచుగా స్టెనోగ్రాఫర్లుగా వ్యవహరిస్తారు. వారు తమ యజమానులు చెప్పిన దానిని మాత్రమే టైప్ చేస్తారు. ప్రభుత్వ వ్యాపార ప్రకటనలను పొందడం ప్రాథమిక లక్ష్యంగా మారింది. దాదాపు అన్ని వార్తాపత్రికలు, ఛానెళ్లు కార్పొరేట్ నియంత్రణలో ఉన్నాయి. మెజారిటీ టెలివిజన్ ఛానెళ్లు అంబానీవే! అంబేద్కర్, గాంధీ అద్భుతమైన జర్నలిస్టులు. ఒక్కొక్కరు మూడు వార్తా పత్రికలను ప్రచురించారు. భగత్ సింగ్ ఒక విప్లవకారుడు. ఆయన ఒక ముఖ్యమైన జర్నలిస్ట్ కూడా! హిందీ, ఉర్దూ, పంజాబీ, ఆంగ్లంలో రాస్తూ ప్రజల సమస్యలను వినిపించారు. జైలులో ఉన్నప్పుడు పర్షియన్ కూడా అభ్యసించారు. కేవలం 23 సంవత్సరాల వయస్సులో, ఆయన చాలా సాధించారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదలకు అనుకూలంగా మార్పు జరుగుతుందని మనం ఆశించలేమని ముగింపులో సాయినాథ్ నొక్కి చెప్పారు. పని హక్కు, విద్యా హక్కు, ఆహార హక్కును రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులుగా గుర్తించాలని ప్రజలతో కలిసి మనం డిమాండ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన హిందుస్థాన్ మాజీ ఎడిటర్ నవీన్ జోషి మాట్లాడుతూ నేడు ప్రెస్ ఒక ఫ్యాక్టరీలా పనిచేస్తోందని, వార్తా పత్రికలను ఉత్పత్తులుగానూ, పాఠకులను వినియోగదారులుగానూ చూస్తున్నారని అన్నారు.

# మరో బరితెగింపు

అమెరికా సామ్రాజ్యవాదం ఇజ్రాయిల్‌తో కలిసి మరో బరితెగింపునకు పాల్పడింది. ఇరాన్‌పై అసాధారణ యుద్ధానికి దిగి ఆ దేశ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనిని అమెరికా, ఇజ్రాయిల్ సేనలు తమ భీకర దాడులతో అత్యంత పాశవికంగా హత్య చేశాయి. ఖమేనితో పాటు 40 మంది అత్యున్నత సైనిక, పాలనాధికారులను సైతం హతం కావించాయి. ఒక దేశంపైకి దండెత్తి విచక్షణారహితంగా దాడులు చేసి పాలకులను దుర్మార్గంగా అంతమొందించడం ఆ దేశ సార్వభౌమత్వాన్ని కాలరాయడమే. అంతర్జాతీయ సంబంధాల ప్రాథమిక సూత్రాలకు విఘాతం కలిగించడమే. ఐక్యరాజ్యసమితి నిబంధనావళిని తుంగలో తొక్కడమే. యుద్ధోన్మాదం తప్ప అమెరికా సామ్రాజ్యవాదానికి అవేవీ లెక్క లేదని పలు సందర్భాల్లో రుజువైంది. అమెరికా దురహంకార ఆధిపత్య చర్యల పరంపరలోనిదే ఇరాన్‌పై తాజా సైనిక చర్య. ఇరాన్‌పై యుద్ధానికి అమెరికా చెప్పేవి కేవలం సాకులు మాత్రమే. గతంలో ఇరాక్ విషయంలోనూ అదే జరిగింది. ఇరాన్ వద్ద అణ్వాయుధాలున్నాయన్నది అమెరికా ప్రధాన ఆరోపణ. మధ్య ఆసియా దేశాల్లోని అపార చమురు నిల్వలు, సహజ సంపదను తన గుప్పెట్లో పెట్టుకోవాలన్నది ఇజ్రాయెల్ ప్రయత్నం. గల్ఫ్ దేశాల్లోని చమురు నిల్వలపై కన్నేసిన అమెరికాకు ఇజ్రాయెల్ వ్యూహాత్మక మిత్ర దేశంగా మారింది. ఈ రెండూ కలిసి ఇరాన్‌లో తమకు కొరకరాని కొయ్యగా తయారై సవాల్ చేస్తున్న అక్కడి పాలకులను దించేసి తమ అనుకూల తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నది అమెరికా పన్నాగం. అందుకు ఇజ్రాయిల్‌ను వాడుకుంటోంది. ఈ వ్యూహం అమలులోనే ఇరాన్‌పై దాడి, ఖమేని అంతం. గత కొన్ని మాసాలుగా ఇరాన్‌పై దాడి చేసేందుకు ఇజ్రాయిల్‌ను అమెరికా పురిగొల్పడంతోపాటు అన్ని విధాలా సహాయ సహకారాలందిస్తోంది. సమయం చూసుకొని అమెరికా, ఇజ్రాయిల్ సేనలు ఇరాన్‌పై అత్యాధునిక సాధన సంపత్తితో శనివారం ఒక్కసారిగా విరుచుకుపడ్డాయి. యుద్ధం తొలి రోజునే ఇరాన్ రాజధాని టెహ్రాన్ నగరం నడిబొడ్డునున్న ఖమేని అధికారిక కార్యాలయంపై అత్యంత ఖచ్చితత్వంతో దాడులను ఎక్కుపెట్టడం అంత సునాయాసం కాదు. అమెరికా గూఢచార సంస్థ సిఐఎ, ఇజ్రాయిల్ ఆధునిక ఇంటెలిజెన్స్ కలిసి ఆధునిక సాంకేతికతను వాడి ఖమేని కదలికలను పసిగట్టి వైమానిక దాడులు, శక్తివంతమైన బంకర్ బ్లాస్ట్ బాంబులను ప్రయోగించి ఖమేనిని హత్య కావించినట్లు కనిపిస్తుంది. సుప్రీంను చంపేసి ఇరాన్ పాలక ప్రభుత్వం, సైన్యంలో మానసిక స్థయిర్యం కోల్పోయేటట్లు చేయొచ్చనుకున్న అమెరికా, ఇజ్రాయిల్‌లకు ఇరాన్ ప్రతీకార దాడులు బెంబేలెత్తిస్తున్నాయి. ఇజ్రాయిల్‌తోపాటు యుఎఇ సహా గల్ఫ్ దేశాల్లో మోహరించిన అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ ప్రతీకార దాడులనే అమెరికా చూపిస్తోంది తప్ప తాను చేసిన నరమేధానికి మాత్రం మసిబూస్తోంది. ఎక్కడేకాని తమను ఎదిరించే ప్రభుత్వాలను దించేందుకు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం, ఆందోళనకారులకు ఆయుధాలిచ్చి అలజడి సృష్టించి ప్రభుత్వాలను అస్థిరపర్చడం అమెరికా విధానం. ఇరాన్‌లో అటువంటి వాటినే ప్రయోగించింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడుల విషయంలో మన దేశ స్పందన అభ్యంతరకరమైనది. రష్యా, చైనా సహా పలు దేశాలు ఇరాన్‌పై దాడిని ఖండించడంతో పాటు సంఘీభావం ప్రకటించాయి. కాగా ఇరాన్ సుప్రీం లీడర్ హత్య, పాఠశాలలపై అమానుష దాడులు ప్రధాని మోడీకి కనిపించలేదు. వాటిని కనీస మాత్రం ఖండించకుండా మౌనం పాటించారు. ఇరాన్ చేసిన ప్రతీకార దాడులను మాత్రం ఖండించారు. మోడీ స్పందన వెనుక అమెరికా ప్రాపకం ఉన్నట్లు అర్థమవుతుంది. ఇరాన్‌తో ఇండియాకున్న చారిత్రక, వాణిజ్య, ఆర్థిక సంబంధాలను మోడీ సర్కారు పట్టించుకున్నట్లు లేదు.

# రంగుల కేళి వలపుల హేళి

జీవితం రంగులప్రపంచం
యాంత్రికమైన జీవితం లో
ఘనీభవించిన బంధాలూ,
భావప్రకటనలూ
వసంతుని ఆగమనంతో
పరవశించి భళ్ళున పురివిప్పుకుంటాయ్...
పదునందుకున్న పరువం
పసుపు కుంకుమ సంగమమమై
స్పర్శచందనాలకారాట పడుతుంది
నలుపెక్కిన కట్టుబాట్ల కన్నుగప్పి
గులాబీ లు దోచుకునే గుంబన
ప్రణయహేళి రసహోలీ
రంగు పడిన వెనువెంటనే
రగులుకునే పోటీలో
రంగుల రంగంలో విరబూసే రంగులరంగవల్లి
వయోభారమైనా బోసినవ్వుల పసితనమై
కల్మషాల రంగుమాపు
ముది మనసుల ఇంద్రదనుసు
మదినిండిన దోస్తానకు
రంగుల ముసుగుకప్పే
రమ్యమైన రసహేళి
రంగుల కేళి
వలపుల హేళి...సరదాల హోలీ
--కొండూరి. కోటిబాబు, హైకోర్టు అడ్వకేట్.
ఎస్పిటియు హైదరాబాద్.



# నల్ల చెరువుకు పూర్వ వైభవం...






కూకట్పల్లి నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: కూకట్పల్లి గ్రామంలో ఒకప్పుడు తాగునీరు, వ్యవసాయం, పాడిపంటలకు జీవనాధారంగా నిలిచిన నల్ల చెరువు గత దశాబ్ద కాలంగా మురుగు నీరు, డ్రైనేజ్, చెత్తతో నిండిపోయి నిర్లక్ష్యానికి గురైంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నగరంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రిస్తూ, మరుగునపడిన నీటి వనరులను పునరుద్ధరించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా, హైడ్రా ఆధ్వర్యంలో నల్ల చెరువును పూర్తిస్థాయిలో శుద్ధి చేశారు. చెరువుకు పూర్వ వైభవం తీసుకొచ్చి, చుట్టూ అందమైన పార్క్ మరియు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చెరువును సందర్శించిన బండి రమేష్ స్థానిక ప్రజలతో కలిసి మాట్లాడారు. వాకింగ్, వ్యాయామం కోసం వచ్చిన గ్రామస్తులు చెరువు అభివృద్ధిపై తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. గతంలో ఊహించని విధంగా చెరువును సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ మేలు చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ , మైనారిటీ, ఎస్సీ, బీసీ సెల్, సేవాదళ్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా తార్నాకలో హోలీ సంబరాలు

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నివాసంలో రంగుల పండుగ వేడుకలు



తార్నాక నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం తార్నాకలోని ఎన్ . రాంచంద్ర రావు నివాసంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు నిర్వహించారు. పరస్పరం రంగులు చల్లుకుని, నృత్యాలు చేస్తూ, మిఠాయిలు పంచుకుంటూ హర్షోల్లాసంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ, హోలీ పండుగ ఐక్యతకు ప్రతీక అని, ప్రతి ఒక్కరి జీవితం రంగులమయం అయి ఆనందభరితంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ సుక్క గణేష్ ముదిరాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# కారేపల్లి రేంజ్‌లో ఘనంగా ప్రపంచ వన్యప్రాణి దినోత్సవ వేడుకలు




సింగరేణి మార్చి 03 నిర్భయవార్త రిపోర్టర్. వన్యప్రాణులు, మొక్కల ప్రాముఖ్యతను చాటి చెప్పే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని కారేపల్లి రేంజ్ పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో పాటు మానవ జీవనానికి మద్దతు ఇవ్వడంలో వన్యప్రాణుల పాత్రను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

**ముఖ్య అంశాలు:**ఈ ఏడాది ఇతివృత్తం 2026 ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా "ఔషధ సుగంధ మొక్కలు ఆరోగ్యం, వారసత్వం జీవనోపాధిని సంరక్షించడం" అనే నినాదంతో ఈ వేడుకలు జరిగాయి. కారేపల్లి రేంజ్ అటవీ శాఖ సిబ్బంది స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అటవీ సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు మాట్లాడుతూ, భావి తరాల మనుగడ కోసం జీవవైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. మెరుగైన భవిష్యత్తు కోసం ప్రకృతిని వన్యప్రాణులను రక్షించుకుందాం అనే ప్రతిజ్ఞతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి.ఎపాఫ్రోడిటస్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆయేషా కుదూసియా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ డి చక్రవర్తి, పి కిషోర్ కుమార్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ ఉష, వీరన్న ,పద్మ ,సైదా ,గాంధీ , పుష్పలత ,నాగరాజు , సిద్ధారావు బాపయ్య కవిత పాల్గొన్నారు.

# ఆదివాసి మహిళకు అరుదైన పురస్కారం

## ఆదివాసీ మహిళలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడంలో ఆమె కీలక పాత్ర



చర్ల మార్చి 03 నిర్భయవార్త ప్రతినిధి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని తేగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న తుర్రం జ్యోతి మహిళా కీర్తి రత్న జాతీయ అవార్డు విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయంలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో వైభవంగా జరిగిన అవార్డుల ప్రధాన కార్యక్రమంలో శ్రీ, శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా అవార్డును ఆమె కు అందజేసి కిరీటం పెట్టి శాలువాతో ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ మహిళలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడంలో ఇప్పపువ్వ లడ్డు తయారీ వంటి అనేక సేవా కార్యక్రమాల్లో ఆమె కీలక పాత్ర పోషించిందని, మరోపక్క ఉపాధ్యాయ వృత్తిలోనూ విద్యార్థుల భవిష్యత్తుకై ఆమె కృషి ఎనలేనిదని ఆమె ఇంకా మరెన్నో అవార్డులను అందుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అవార్డును అందుకున్న తుర్రం. జ్యోతి మాట్లాడుతూ విద్యారంగం, గిరిజన మహిళ అభివృద్ధి, సేవా రంగంలో ఆమె చేసిన కృషిని గుర్తించి శ్రీ శ్రీ కళావేదిక అవార్డు ఇవ్వడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని అవార్డుకి ఎంపిక చేసిన సీఈ.ఓ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం లకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# రంగుల సందడిలో తెలుగు విశ్వవిద్యాలయం




కూకట్పల్లి, నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో హోలీ పండుగను విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థినులు, విద్యార్థులు మరియు ఏబీవీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందంగా హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హోలీ పండుగ హిందూ సంప్రదాయాలలో ప్రత్యేక స్థానం కలిగినది. ప్రహ్లాదుడు భక్తి, హోలిక దహనం ద్వారా చెడుపై మంచికి కలిగిన విజయాన్ని సూచించే ఈ పండుగ, సత్యం--ధర్మం ఎల్లప్పుడూ గెలుస్తాయనే సందేశాన్ని ఇస్తుంది. వసంత ఋతువు ఆరంభాన్ని సూచించే హోలీ, మనుషుల మధ్య భేదాలను తొలగించి స్నేహం, ప్రేమ, ఐక్యతను పెంపొందించే సామాజిక పండుగగా భావిస్తారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ భరత్ మాట్లాడుతూ యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. "యువశక్తి దేశశక్తి" అనే నినాదంతో విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో ముందుండాలని సూచించారు. స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆయన చెప్పినట్లుగా "ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత" (లేచి నిలబడి, లక్ష్యం సాధించే వరకు ఆగవద్దు) యువత ధైర్యం, క్రమశిక్షణ, దేశభక్తితో ముందుకు సాగాలని నాయకులు పేర్కొన్నారు. శారీరక దృఢత్వం, మానసిక బలం, సద్గుణాలు కలిగిన యువతే బలమైన భారతాన్ని నిర్మించగలదని వారు తెలిపారు. హోలీని పర్యావరణానికి అనుకూలంగా, సురక్షితంగా జరుపుకోవాలని, సహజ రంగులను మాత్రమే ఉపయోగించాలని మరియు నీటి వృథాను నివారించాలని ఏబీవీపీ యూనిట్ విద్యార్థులకు సూచించింది. ఈ కార్యక్రమంలో ఎబివిపి కార్యకర్తలు విశ్వవిద్యాలయ విద్యార్థులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతో సొంతింటి కల సహకారం...


## ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన...
## కౌన్సిలర్ కటికెల శ్రీవాణి వైద్యనాథ్



మూడుచింతలపల్లి, నిర్భయవార్త ప్రతినిధి: మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధి లక్ష్మాపూర్ 3వ వార్డులో మహ్మద్ షాహీధ బేగం,అహ్మద్ దంపతులకు ప్రభుత్వం మంజూరూ చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులకు కౌన్సిలర్ కటికెల శ్రీవాణి వైద్యనాథ్ శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇల్లు పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు సొంత ఇంటి నిర్మాణం కోసం మొత్తం రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేస్తుంది. ఈ నిధులను ఇంటి నిర్మాణ పురోగతిని బట్టి ప్రభుత్వం విడతల వారీగా చెల్లింపులు చేస్తుంది. పునాది తీసి బేస్ మేంట్ నిర్మిస్తే రూ 1 లక్ష, గోడలు కట్టిన తరువాత రూ 1.25 లక్షలు, స్లాబ్ పూర్తయ్యాక రూ. 1.75 లక్షలు, ఇల్లు పూర్తయిన తరువాత రూ. 1 లక్ష, లను ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమచేస్తుంది అని తెలిపారు. వీటితో పాటు వార్డులో పర్యవేక్షించి డ్రైనేజీ సమస్యలతో అవస్థలు పడుతున్న ప్రజలను చూసి శాశ్వత డ్రైనేజీ ల మరమ్మత్తులు చేయడమే తన ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 3,5 వార్డుల కాంగ్రెస్ అధ్యక్షుడు కటికెల గోపి, జనరల్ సెక్రటరీ కొమ్ము లక్ష్మణ్, వార్డు కార్యాలయ సిబ్బంది మంగ నర్సింహులు, నాయకులు క్యాసారం అశోక్, కావలి చిన్నబాబు,చిన్నలచ్చ మురళి, మర్యాల ప్రభాకర్, తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

## వాసిరెడ్డి సంపత్ ను సన్మానించిన ఆలయ కార్యనిర్వాహాధికారి






సింగరేణి మార్చి 03 నిర్భయవార్త ప్రతినిధి :కారేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం మంగళవారం ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆదాయంలో లెక్కించారు. లెక్కింపులో 11,799 ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి కొండకింది వేణుగోపాలచార్యులు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం విజయవంతం చేయుటలో కారేపల్లి గ్రామవాసి వాసిరెడ్డి సంపత్ కృషి మరువలేనిదని కార్యనిర్వాణా అధికారి, సిబ్బంది ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ ఇన్స్పెక్టర్ ఆర్. సమత, గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ టోనీ, ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్య లక్ష్మి, సురేష్, ఎర్ర నరసింహారావు, సురేందర్, వాసిరెడ్డి సంపత్ వాంకుడోత్ రాందాస్, శ్రీరామ్ ఆలయ అర్చకులు వినయ్శర్మ, జూనియర్ అసిస్టెం ట్ మూడు మోహన్, కె సత్యం తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమం "దండి మార్చి 2. 0 కార్యక్రమం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ"....




నిర్భయవార్త ప్రతినిధి : భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో దేశ యువత భవిష్యత్తుకి ప్రతిబంధకంగా మారిన మాదగద్రవ్యాల పట్ల చైతన్యం కలిగించాలని "వైబ్రంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్" ఆధ్వర్యంలో బలమైన కార్యాచరణ రూపొందించడం జరిగింది. మాదక ద్రవ్యాలను అరికట్టడం కోసం బలమైన ఉద్యమం చేయాలనే దృఢ సంకల్పంతో ఆనాడు స్వాతంత్ర సంగ్రామంలో మహాత్మా గాంధీ దేశ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించడం కోసం "దండి మార్చిని" (ఉప్పు సత్యాగ్రహాన్ని) నిర్వహించిన విషయం మనందరికీ తెలిసినదే ఆ మహాత్ముని బాటలో ఈనాడు దేశ ప్రజల్లో డ్రగ్స్ మహమ్మారి పట్ల చైతన్యం కలిగించాలని ధ్యేయంతో దండి మార్చి 2.0 కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. దండి మార్చ్ 2. 0 లో భాగంగా 100 మీటర్ల పొడవైన జాతీయ పతాకంతో వేలాదిమంది విద్యార్థులు మరియు యువతతో ర్యాలీ మరియు మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేసే కార్యక్రమం కు సంబంధించిన ఆహ్వాన పత్రికను బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు టిడిపి కార్యాలయము నందు ఆవిష్కరించినారు. వేగేసిన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు, ప్రజలు భాగస్వామ్యం దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపాలని దండి మార్చి 2. 0 కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరినారు. పై ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో రోజు ఆర్గనైజేషన్ అధ్యక్షులు పొందుగుల.ప్రసాద్, శ్రీ భావపురి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు, మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ ప్రతినిధి ఎస్.కె సాదిక్, స్టేట్ మైనార్టీ సెల్ సెక్రెటరీ ఫరీద్, కర్లపాలెం టిడిపి మండల అధ్యక్షులు వై. భూపతి రావు, మద్దాల మునలయ్య, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రేమ హస్తం ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు అప్పన్న హస్తం






నిర్భయవార్త ప్రతినిధి :ఘట్కేసర్, మార్చి 03: ప్రేమ హస్తం ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాలలో నివసిస్తున్న వృద్ధులకు ప్రతి నెల మొదటి వారంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ మరియు చైర్మన్ రెవరెండ్ డాక్టర్ విజయ్ దార్ల తెలిపారు. ఉప్పల్ పరిసర ప్రాంతంలో ఉన్న శ్రీ కృష్ణ ఓల్డ్ ఏజ్ హోమ్ లో నివసిస్తున్న వృద్ధులకు భోజనం మరియు టిఫిన్ సౌకర్యం కల్పిస్తున్నామని, ఈ కార్యక్రమం గత ఒక సంవత్సరంగా నిరంతరంగా కొనసాగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక మంది వృద్ధులు అనాధాశ్రమాలలో నివసిస్తూ ప్రాథమిక అవసరాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వారికి అవసరమైన భోజన పదార్థాలు, కప్పుకోవడానికి బెడ్‌షీట్లు వంటి అవసరమైన వస్తువులను అందజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నెల మొదటి వారంలో ఉప్పల్ పరిసర ప్రాంతంలోని వృద్ధాశ్రమాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ మరియు చైర్మన్ విజయ్ దార్ల, రెవరెండ్ డాక్టర్ ఎలిజిబెత్ దార్ల, సభ్యులు సిహెచ్ నాగేశ్వరరావు, పరిమళ, ఓ జే మోజస్, టి రోజా, కె రాజారావు, రిబ్కారాణి, కోళ జయ, జిమ్మీ, కౌశిక్, నేహా, నయోమి, వినయ్, సూచిత, నేహా హనోకు, అనుష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు పరిష్కరించడమే బిజెపి "జనత వారిది" ప్రధాన ఉద్దేశం-లక్ష్మణ్ మేకల

## బిజెపి ఎస్సీ మోర్చా కోస్తాంధ్ర జోనల్ ఇంచార్జ్



మంగళగిరి, నిర్భయవార్త ప్రతినిధి :భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కరించుటకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "జనతా వారధి" కార్యక్రమం బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి మొండి వీరబాబు నేతృత్వంలో మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యులుగా బిజెపి ఎస్సీ మోర్చా కోస్తాంధ్ర జోనల్ ఇంచార్జ్ లక్ష్మణ్ మేకల పాల్గొని ప్రజా సమస్యల పైన మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ను కలిసి ప్రజా అవసరతలను వివరిస్తూ మంగళగిరి పట్టణంలో కాళికాదేవి టెంపుల్ ఎదురుగా ప్రయాణికులకు బస్ షెల్టర్ లేక చాలా ఇబ్బందులకి గురవుతున్నారని, ప్రజలు ఆ సమస్యను బిజెపి "జనతా వారధి" దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించమని కోరియున్నారు. ఈ సందర్భంగా ఆ సమస్య పట్ల భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు అడిషనల్ కమిషనర్ కి =వినతిపత్రం అందించి బస్సు సెంటర్ ను ఏర్పాటు చేయమని కోరారు. మరియు తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గుండిమెడ గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా వాటర్ బోరు వేసినప్పటికీ నేటికీ వాడుకలోకి రాని విధానాన్ని వివరిస్తూ వెంటనే ప్రజలకు అవసరాల నిమిత్తం వాటర్ బోరును నీటి సరఫరాను అందించాలని కోరారు. ఈ సందర్భంగా సదరు ప్రజా సమస్యలపై అడిషనల్ కమిషనర్ కె శకుంతల సానుకూలంగా స్పందిస్తూ వెంటనే సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ కార్యదర్శిపడమటి సురేష్, బిజెపి ఓ బి సి నాయకులు బొందిలి చౌహాన్ సింగ్, మంగళగిరి రూరల్ మండలం నాయకులు గాదె విజయ్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ పండుగ వేడుకలు



నిర్భయవార్త ప్రతినిధి :మార్చ్ 3 మధిరలో స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పరస్పరం రంగులు చల్లి ఆనందంగా హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారంతా ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ హోలీ పండుగ సోదరభావం, ఐక్యతకు ప్రతీక అని తెలిపారు. సమాజంలో అందరూ ఆనందంగా, ఐక్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, యువకులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని వేడుకలను మరింత ఉత్సాహంగా జరిపారు. హోలీ పండుగ సందర్భంగా స్విమ్మర్స్ అందరికీ లక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి లక్కిరెడ్డి అమ్మడు స్వీట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో పల్లపోతుల ప్రసాదరావు,చుక్కా రాంబాబు, చల్ల సత్యనారాయణ, గండూర్ రాంబాబు, ఊట్కూరు భాస్కరరావు, జింకల కోటేశ్వరరావు, లింగంపల్లి అప్పారావు, ఆవుల సంతోష్, ఆదూరి అబ్రహం, కొలగాని ప్రసాద్, శీలం శ్రీనివాసరెడ్డి (ఎస్ ఎస్ ఆర్ )వనమా కిరణ్, గొల్లపల్లి శ్రీనివాస చారి, మిడ్ స్ట్రీట్ ఆనిఫ్, వంగవీటి రాజశేఖర్, వట్టే సైదులు, వందనపు శ్రీనివాసరావు, మేకల ఉపేంద్ర, సముద్రాలు ఉపేంద్ర, చిట్టాల శేషు, శ్రీశైలం,చలువాది వరుణ్, ఫైర్ పిచ్చిరెడ్డి,ఎస్బిఐ రాజశేఖర్ రెడ్డి కొత్తూరు నరసింహారావు టీచర్ అజయ్ కోలా ప్రసాద్ వెంకన్న అర్జున్ మణిదీప్ శేఖర్ రెడ్డి అబ్బాయిలు ఆవుల శాన్వి బంటి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తు కొరకు పాటుపడే వ్యక్తి అందరివాడిగా మనసులో ఉన్న వ్యక్తి ఉద్యోగ విరమణ సన్మాన గ్రహీత ఎంఈఓ ప్రభాకర్



నిర్భయవార్త ప్రతినిధి : మార్చి 3 మండలం పరిధిలో దెందుకూరు గ్రామ లో శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఉద్యోగి విరమణ సన్మానం గ్రహీత ఎంఈఓ ప్రభాకర్ కార్యక్రమంలో భాస్కర్ స్కూల్ అధినేత సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు ప్రముఖులుఅలూరి వెంకటేశ్ రెడ్డి కోటిరెడ్డి వేణు ప్రైవేట్ స్కూలు అధినేతలు మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకట రెడ్డి ఖమ్మంపాడు సర్పంచ్ విద్యాసంస్థల అధినేత అంజన్ బాబు పుతంబకా కృష్ణ ప్రసాద్ ఈవో ప్రభాకర్ సన్మాన విద్యా రంగంలో నిజాయితీగా పనిచేసే అధికారులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేసే విద్యాధికారులు మరింతగా సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు అదేవిధంగా.ప్రభాకర్ తన విధుల్లో నిబద్ధతతో పనిచేసి ఉపాధ్యాయులు, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. ఇటువంటి అధికారులు ఉండటం విద్యా వ్యవస్థకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న పలువురు ప్రముఖులు ప్రభాకర్ గారిని సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఉద్యోగ విరమణ పొందిన ఎంఈఓ ప్రభాకర్ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఉద్యోగ విరమణ పొందిన ఎంఈఓ ప్రభాకర్ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ ఉద్యోగ విరమణ పొందిన ఎంఈఓ ప్రభాకర్ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఐ నాయకులు బెజవాడ రవిబాబు. ఉద్యోగ విరమణ పొందిన మధిర ఎంఈఓ ప్రభాకర్ సన్మాన సభ ఘనంగా ప్రారంభం..హాజరైన రాజకీయ నాయకులు ఉపాధ్యాయ సంఘాలు తదితరులు. ప్రైవేట్ స్కూల్లో అధినేతలుప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు అభిమానులు రాజకీయ నాయకులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## అష్టలక్ష్మి ఆలయంలో మహా పూర్ణాహుతి



నిర్భయవార్త ప్రతినిధి : జగిత్యాల ప్రతినిధి, మార్చి 03 : కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్ శ్రీ అష్టలక్ష్మి సహిత శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయ సప్తమ దశ వార్షికోత్సవ పంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం యజ్ఞాచార్యులు సముద్రాల శ్రీరామ్ ఆచార్యుల వైదిక నిర్వహణలో నిత్యారాధన, నిత్యోపాసన, మహా పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం చంద్ర గ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేశారు. ఈ కార్యక్రమంలో యజ్ఞాచార్యులు సముద్రాల శ్రీరామాచార్యులు, రమణాచార్యులు వరుణ్ వాసుదేవాచార్యులు, నచికేతనాచార్యులు, రమణాచార్యులు, ఆలయ అర్చకులు ఇందుర్తి మధుసూదనా చారి, పెరంబదూరి శ్రీనివాస్, ఆలయ నిర్వాహకులు బూరుగు రామస్వామి సుభద్ర దంపతులతో పాటు బూరుగు రామస్వామి గౌడ్ కుమారుడు బూరుగు తిరుమల్ గౌడ్ గాయత్రి, ఎలిశెట్టి భూమారెడ్డి, ముత్యాల గంగాధర్, ఇల్లెందుల వెంకట్రాములు, పడాల వెంకటేశ్వరరావు, కోటగిరి మహేష్, చిలుక గంగాధర్, భూమయ్య, సతీష్, రమణ, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ పేట భాస్కర్ జన్మదిన వేడుకలు



నిర్భయవార్త ప్రతినిధి : జగిత్యాల ప్రతినిధి, మార్చి 03 : తెలంగాణ ఉద్యమ నేత, ప్రజాసంఘాల జేఏసీ అంబేద్కర్ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, ప్రజాదండోర తెలుగు దినపత్రిక ఎడిటర్ డాక్టర్ పేట భాస్కర్ జన్మదిన వేడుకల సందర్భంగా పలువురు నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కోరుట్లలో మంగళవారం పేట భాస్కర్ నివాసంలో తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నాయకులు భాస్కర్ ను శాలువాలతో సన్మానించి, బర్త్డే కేక్ తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి పేట భాస్కర్ ఎదగాలని, ఇప్పటికే అనేక ఉద్యమాల ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నేతగా, జాతీయ సేవా రత్న, రాష్ట్ర ప్రభుత్వం చే దళిత రత్న అవార్డులతో పాటు ఆసియా ఇంటర్నేషనల్ రిసోర్స్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అవార్డు పొందిన ఘనత పేట భాస్కర్ దని, ప్రజా నేస్తం ఎన్జీవో సంస్థతో పాటు ప్రజల పక్షాన ఢీ అంటే ఢీ అంటు ప్రజా దండోరా తెలుగు దినపత్రిక సంపాదకులుగా పత్రికను దిగ్విజయంగా నడిపిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బొనగిరి మల్లారెడ్డి, జాగర్ల రాజయ్య, శనిగారపు రాజేష్, ఎస్ రాజయ్య, మహేష్, కుమార్, ప్రభాస్, సురేష్ లు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులకు ప్రతినెల చికెన్ భోజనం





నిర్భయవార్త ప్రతినిధిఅచ్చంపేట (మార్చి 3): అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలం గట్టు తుమ్మెన్ గ్రామ అభివృద్ధి కోసం పాఠశాల, అంగన్వాడి లో ప్రతి నెలలో ఒక్కసారి ఓ బి సి చైర్మన్ వంగ గిరి వర్ధన్ గౌడ్ తన సొంత ఖర్చులతో పిల్లలకు భోజనం చికెన్ తో విద్యార్థులకు అందిస్తున్నారు ఊర్లో ఏ సమస్యలున్నా ముందుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్నారు. గ్రామస్తులు గిరి వర్ధన్ గౌడ్ సేవలను ప్రశంసిస్తున్నారు.


## మోర్తాడ్ లో హోలీ పండుగ రంగుల వానలో తడిసి మురిసిన చిన్నారులు



నిర్భయవార్త ప్రతినిధి :బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 03: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని రంగుల పండుగ హోలీ వేడుకలు మిన్నంటాయి. వసంత పంచమి వేళ ప్రకృతి పులకించినట్లుగా, మండలంలోని చిన్నారులు, యువకులు రంగుల కేళిలో మునిగితేలారు. మంగళవారం ఉదయం నుంచే వాడవాడలా హోలీ సందడి మొదలైంది చిన్నారులు గుంపులు గుంపులుగా చేరి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ముఖాలకు రంగులు పూసుకుని, పిచికారీలతో రంగు నీళ్లు చిమ్ముకుంటూ వీధుల్లో కేరింతలు కొట్టారు. చిన్నారుల ఉత్సాహం చూస్తుంటే మోర్తాడ్ వీధులన్నీ రంగుల లోకాన్ని తలపించాయి.
యువకులు డిజే పాటల చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ, పాత విద్వేషాలను వీడి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే ఈ పండుగ, మోర్తాడ్ లో సోదరభావాన్ని చాటిచెప్పింది. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ప్రశాంతమైన వాతావరణంలో సంబరాలు ముగియడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

## కలెక్టర్ల సదస్సులో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారి సూచనలు






నిర్భయవార్త ప్రతినిధి :కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 3: ఆదేశాలు 99 రోజుల కార్యక్రమాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లను భాగస్వాములను చేయాలి. వార్డు సభ్యులు, సర్పంచులు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లు అందరికీ జిల్లా కేంద్రాల్లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలి.. వారి విధులు, బాధ్యతలకు సంబంధించి అవగాహన కల్పించడంతో పాటు ప్రింటెడ్ మెటీరియల్ వారికి అందించాలి.సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి. వ్యవసాయ పంప్ సెట్లకు బదులు సోలార్ పంప్ సెట్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి.. సోలార్ మోటార్లతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలి. ఇళ్లపైన సోలార్ ప్లాంట్లు అమర్చుకోవడం.. సోలార్ విద్యుత్ వాడుకోవటం తో పాటు గ్రిడ్ కు కనెక్ట్ చేయడం ద్వారా వచ్చే ఆదాయంపై అన్ని గ్రామాల్లో విద్యుత్ శాఖ అవగాహన కల్పించాలి. గ్రామ, వార్డు సభల్లో నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల వివరాలు తెలియజేయాలి. వాటితో గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి కలిగిన లబ్ధిని ప్రజలకు వెల్లడించాలి. రాష్ట్రంలో ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కళాశాలల సేవలు ప్రజలకు అందేలా చూడాలి. పీహెచ్సీలు, సీహెచ్సీలు, ఇతర స్థానిక వైద్య సంస్థలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలకే రిఫర్ చేయాలి. మెడికల్ కళాశాలల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలు, వైద్య విద్యార్థులు, వైద్యులు, ప్రొఫెసర్లు ఉన్నారు.. వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ప్రభుత్వ పథకం లబ్ధిదారుల ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిజేషన్) చేపట్టాలి.. అర్హులకు కచ్చితంగా లబ్ధి జరగాలి. అదే సమయంలో అనర్హులు లబ్ధిపొందకూడదు. ఆసరా పింఛన్లలో ముఖ గుర్తింపు చేపట్టడంతో 3 లక్షల మంది అనర్హుల పేర్లు తొలగించగలిగాం.. సాంకేతికతను సరిగా వినియోగించుకోకపోవడంతోనే ఇంత పెద్ద సంఖ్యలో అనుచిత లబ్ధి పొందారు.రవాణా శాఖ డాటా ఆన్లైన్ పూర్తి చేయాలి. పాఠశాలలు బస్సులు, ఇతర వాహనాలకు ఫిట్నెస్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి. ఆర్టీసీ బస్సు డ్రైవర్లతో పాటు లారీలు, ఇతర సరకు రవాణా వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలి. ఎక్కువ సంఖ్యలో డ్రైవర్లు కలుసుకునే చోట్లనే ఈ శిబిరాలు ఏర్పాటు చేసి వారికి పరీక్షలు నిర్వహించాలి. రహదారులపై భారీ స్థాయిలో గుంతలు, ప్రమాదం జరిగే స్థలాల వివరాలు తెలుసుకునేందుకు వాట్సాప్ నెంబర్ ను రవాణా శాఖ ఇవ్వాలి. ఆ నంబర్కు వచ్చే సమాచారం ఆధారంగా అక్కడ మరమ్మతులు చేపట్టడం, ఇతర జాగ్రత్తలు తీసుకోవడం చేయాలి.ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ సర్వీసు రోడ్ల వెంట భారీగా చెత్త, ఇతర నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. వ్యర్థాలను తీసుకువచ్చే వాహనాలను పట్టుకొని జరిమానాలు విధించాలి. కేసులు పెట్టాలి. ఓ ఆర్ ఆర్ ఏజెన్సీని బాధ్యులను చేయాలి. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లించాలి. పిల్లలకు పోషకాహారం అందాలి. అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలి.మూడు కార్పొరేషన్లతో పాటు నగరాలు, పట్టణాల్లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, బాయ్స్, గరల్స్ హాస్టళ్ల వివరాలు నమోదు చేసుకోవాలి. ఆయా హాస్టళ్ల ఏర్పాటుకు అనుమతులు, వాటిపై పర్యవేక్షణ ఉండాలి. వాటి యాజమాన్యాలకు జవాబుదారీతనం ఉండాలి. పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈ-సిగరెట్ల వినియోగం జరిగితే అందుకు ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు బాధ్యత వహించాలి.. ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల, కళాశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్, పీఈటీ ఎలా ఉంటారో అలానే సైకాలజిస్ట్ ఉండేలా చూడాలి.వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు చేపట్టి సకాలంలో రైతులకు వాటి సమాచారం అందజేయాలి.. ఏ భూమిలో ఏ పంట బాగా పండుతుంది అనే విషయం రైతులకు తెలియజేయాలి.. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా అన్నదాతలను ప్రోత్సహించాలి...పంట మార్పిడి, పంటల వైవిధ్యత ప్రయోజనాలను వివరించాలి.యూరియా యాప్లో కొంత గందరగోళం ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. దానిని సులువుగా వినియోగించేలా మార్పులు చేయాలి.. నానో యూరియా ఉపయోగాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శన ద్వారా రైతులకు చూపించాలి. వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ పరస్పరం సమన్వయంతో ముందుకు సాగాలి. పంటలు వేసే మొదలు పంట ఉత్పత్తుల అమ్మకం వరకు సరైన కార్యాచరణ ప్రణాళిక ఉంటేనే ఇబ్బందులు ఎదురుకావు. ఈ విషయంలో ఈ రెండు శాఖలు పరస్పర సహకారంతో ముందుకుసాగాలి.కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో పంటల వైవిధ్యతకు ఉన్న అవకాశాలపై నివేదిక సమర్పించాలి..

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ని పరామర్శించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



నిర్భయవార్త ప్రతినిధి :కల్వకుర్తి నియోజకవర్గం ప్రతినిధి మార్చి 3 కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాతృమూర్తి మంగమ్మ మంగళవారం ఉదయం మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెల్లంపల్లి గ్రామానికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ని పరామర్శించి అనంతరం మంగమ్మ భౌతిక కాయంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్ కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## కరాటే లో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినిల ఉత్తమ ప్రతిభ...



నిర్భయవార్త ప్రతినిధి : మార్చి 3 మహబూబాబాద్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ ఖమ్మం డిగ్రీ కళాశాల (కోదాడ క్రాస్ రోడ్) విద్యార్థినీలు వి.ఎం. బంజర లో జరిగిన 13 వ శ్రీకాంత్ మెమోరియల్ కరాటే ఛాంపియన్ షిప్ -2026 (ఎఫ్ ఎస్ ఎస్ కె ఐ) అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్ లో పాల్గొని ప్రభంజనం సృష్టించారు ఈ పోటీల్లో గార్ల పట్టణానికి చెందిన వల్లపుదాసు స్పందన (గార్ల మండల సాక్షి డిజిటల్ విలేకరి వెంకటేశ్వర్లు) చిన్న కుమార్తె తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతుంది ఈ కరాటే పోటీల్లో వి. స్పందన,ఏ.వరలక్ష్మి, పి. మహా. పి. శ్రీ శాంతి, టీ.పల్లవి, బి.మౌనిక కటాస్ విభాగంలో పాల్గొని బంగారు పతకాలు ఎల్. ప్రవళిక కాంస్య పతకాలు సాధించారు అలాగే స్పేరింగ్ విభాగంలో వి.స్పందన ఎన్. విజయకుమారి,టీ.పల్లవి,పి. మహా కాంస్య పథకాలు సాధించారు కరాటే పోటీల్లో గెలుపొందిన విజేతలకు కళాశాలలో ఘన స్వాగతం పలికి కళాశాలలో విజయోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.ఎం. సునీత మాట్లాడుతూ విద్యార్థినులు ఇంకా ముందు ముందు గొప్ప గొప్ప కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని తెలియజేస్తూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అభినందించి, ఆశీర్వాదించారు. విద్యార్థులకు ఇంత బాగా శిక్షణ ఇచ్చి సహాయ,సహకారాలు అందించిన కళాశాల పీ.డి వై.చామంతి ని మెచ్చుకున్నారు. ఈ ఉత్సవాల్లో కళాశాల వైస్ ప్రిన్సిపల్, కే.కల్పన, హౌస్ పేరెంట్ డాక్టర్ బి.ఎస్ శశికళ అధ్యాపక బృందం, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



నిర్భయవార్త ప్రతినిధి :కామారెడ్డి జిల్లా బిబిపెట్ మండలంలో ఈరోజు 11 గంటల సమయంలో శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం తరపున హోలీ సందర్భంగాఅంకాలం నరేందర్ అధ్యక్షతన రంగులతో ఆటలు ఆడడం జరిగింది ఉపాధ్యక్షుడు చింతకింది వేణు గారు మరియు పెంటప్ప ,సంతోష్ , రాము, సూర్యకాంత్ గణేష్ ,సందీప్, రమేష్ రాజు ,పాల్గొని విజయవంతం చేయడశీ జరిగింది.

## పకిటెక్యాలో అంబరాన్నంటిన చిన్నారుల హోలీ సంబరాలు



నిర్భయవార్త ప్రతినిధి :ఘట్‌కేసర్ ప్రతినిధి /మార్చి 3: మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్, ఉప్పల్ జోన్ ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని ఎదులాబాద్ డివిజన్ పకిటెక్యాలో హోలీ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం జరిగిన ఈ వేడుకల్లో స్థానిక చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఒకరిపై ఒకరు రంగుల చల్లుకుంటూ సందడి చేశారు.పకిటెక్యాలోని కాలనీల్లో చిన్నారుల కేరింతలతో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం నుండే చిన్నారులు గులాబి,పసుపు, ఆకుపచ్చ వంటి రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. పెద్దల సమక్షంలో చిన్నారులు సాంప్రదాయబద్ధంగా ఎంతో ఆనందంగా పండుగను జరుపుకున్నారు. రంగులు పూసుకున్న చిన్నారులు తమ స్నేహితులతో కలిసి ఫోటోలకు ఫోజులిస్తూ ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు.

## హోలీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సోదరుడు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి జిల్లా నాయకులు




నిర్భయవార్త ప్రతినిధి :నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రతినిధి మే 3 నారాయణఖేడ్ నియోజకవర్గం కేంద్రంలో శాసనసభ్యులు డాక్టర్ పట్లోల సంజీవరెడ్డి స్వగృహంలో హోలీ సంబరాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి పట్లోళ్ల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ యూత్ పిల్లలతో యువత హోలీ సంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ హోలీ పండుగ అంటే రంగుల పండుగ మాత్రమే కాదు మనుషుల మధ్య ఉన్న విభేదాలను తొలగించే మైత్రి పండుగ ఈ పండుగ శత్రువులను స్నేహితుడిగా మార్చే శక్తి కలిగిన రోజు బరువైన బాధలను తు డిచిపెట్టే జీవితాన్ని రంగులమయం చేసే ఉత్సాహపూరిత వేడుక అని నియోజకవర్గం మున్సిపాలిటీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ 9 వార్డ్ కౌన్సిలర్ బాణపురం రాజు ముదిరాజ్,మధుసూదన్ రెడ్డి, పి. సుధాకర్ రెడ్డి, జైపాల్ రెడ్డి,శరత్,గోవర్ధన్ రెడ్డి, గోపాల్ రెడ్డి,లక్ష్మణ్, హరి, సంగప్ప,శివకుమార్, నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు

## విద్యా తో పాటు విజ్ఞాన యాత్రలు. ప్రత్యక్ష అభ్యాసనాలు : ప్రధానోపాధ్యాయులు నీలం సంపత్





నిర్భయవార్త ప్రతినిధి : ధర్మపురి నియోజకవర్గ ప్రతినిధి మార్చి 3 విద్యతో పాటు విజ్ఞాన యాత్రలు కూడ విద్యార్థులకు ప్రత్యక్ష అభ్యాసనాలు అవుతాయి అని ప్రధానోపాధ్యాయులు నీలం సంపత్ అన్నారు సోమవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని పాశిగామ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులు,లతో కలిసి విద్య, విజ్ఞాన, వినోదయాత్రలో భాగంగా కాకతీయులు పరిపాలించిన రాజధాని అయిన ఓరుగల్లు పట్టణాన్ని సందర్శించారు ఈ సందర్భంగా విద్యార్థులు కాకతీయ రాజుల కట్టడాలను, ప్రపంచ వారసత్వ సంపదగా నిలిచిన రామప్ప దేవాలయం, లక్నవరం తీగల వంతెన మరియు దీపం , ఓరుగల్లు కోట కాకతీయ శిలా తోరణాలను, వేయి స్తంభాల గుడిని సందర్శించడం జరిగింది. రామప్ప దేవాలయంలోని రాతి స్వరాలు పలికే శిల్పకళాకు విద్యార్థులు ఆశ్చర్య పోవడం జరిగింది. అదేవిధంగా కాకతీయుల కోట తెలంగాణకే తలమానికంగా నిలిచిన తోరణం, వేయి స్తంభాల గుడిని సందర్శించి, ప్రాచీన భారత వారసత్వ శిల్పకళకు, నీటిపై తెలియాడే ఇటికలను చూసి చాలా ఆసక్తిని వ్యక్తపరచడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నీలం సంపత్ మాట్లాడుతూఇటువంటి విహార విద్య విజ్ఞాన యాత్రలు వల్ల విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాలతో పాటు ప్రాచీన వారసత్వం పై ఆసక్తి, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తాయని ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, ప్రణీత, రజిత, పాఠశాల సహాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడికి లేబర్ ఇన్సూరెన్స్ డబ్బులు మంజూరి : చేయించిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కృతజ్ఞతలు : సిగిరి ఆనంద్



నిర్భయవార్త ప్రతినిధి : ధర్మపురి నియోజకవర్గ ప్రతినిధి మార్చ్ 03 జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు లింగాల చిన్నయ్య ఇటీవల తేదీ 2-09-2025 నా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందగా లేబర్ ఇన్సూరెన్స్ డబ్బులు ఇప్పించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ని ఎండపల్లి మండలం బిజెపి పార్టీ మజ్దూర్ సంఘం అధ్యక్షులు సిగిరి ఆనంద్ మంత్రి వివేక్ వెంకటస్వామి ని కలిసి వినతి పత్రం 07-01-2026 నా అందించగా వెంటనే స్పందించిన మంత్రి వివేక్ వెంకటస్వామి లేబర్ బోర్డు అధికారులు ఆయన సీఈవో గంగాధర్ ను లేబర్ ఇన్సూరెన్స్ డబ్బులు ఇప్పించాలని ఆదేశించారు మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశాలు అందుకున్న లేబర్ బోర్డ్ అధికారులు సీఈఓ గంగాధర్ విజయ సాగర్ లు వెంటనే యాక్సిడెంట్ బీమా 10 లక్షల రూపాయలు మంజూరు చేసి మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు లింగాల చిన్నయ్య భార్య అయిన(నామిని) సుశీల అకౌంట్లో పది లక్షల రూపాయలు జమ చేయడం జరిగింది లేబర్ బీమా డబ్బులు తొందరగా ఇప్పించిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి కి ఎండపల్లి మండల బిజెపి పార్టీ మజూరిది సంఘం అధ్యక్షులు సిగిరి ఆనంద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# 10 వ తరగతి 100% ఫలితాల భావం ఏమిటి పరీక్షలువిద్యార్థులకా ఉపాధ్యాయులకా

నిర్భయవార్త ప్రతినిధి : నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రతినిధి మే 3ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పదవ తరగతి పరీక్షలు వచ్చేసాయి మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు 100% ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నారు. దీనిని కింది స్థాయిలో ఎలా అర్థం చేసుకుంటున్నారు 100% ఉత్తీర్ణత అంటే విద్యార్థులు బాగా చదువుకొని పాస్ అవ్వాలనా లేక ఎటువంటి దారి ఎంచుకొని అయినా 100% ఉత్తీర్ణత పొందడమా 100% ఉత్తీర్ణత పొందడానికి కోసం ఉన్నత విద్య శాఖ 52 రోజుల ప్రణాళిక,అలాగే మూడు ప్రాక్టీస్ టెస్టులను నిర్వహిస్తుంది.



ఇదంతా సరే ఇన్ని విషయాలను చేసిన తర్వాత ఇంకా ఎందుకు పరీక్షా విధానం మారడం లేదు ఇంకా ఎన్ని రోజులు ఈ చూచిరాతల పరీక్షలు అసలు పరీక్షలు విద్యార్థులకా లేక ఉపాధ్యాయులకా అంటే ఉపాధ్యాయులకే అనిపిస్తుంది. గత మూడు సంవత్సరాలుగా 10వ తరగతి ఫలితాలను చూసుకుంటే 2025 -92.78%, 2024 - 91.31. 2023-86.60 గా ఉన్నాయి, కానీ ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం ఫలితాలను చూసుకుంటే ఉత్తీర్ణత శాతం 67%-69% గా ఉంది. ఇంత తేడా ఎందుకు వస్తుందో స్పష్టంగా తెలుస్తుంది . ఈ విషయంపై సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఓ సందర్భంలో మాట్లాడడం జరిగింది. చూచిరాతల విద్యల వల్ల బాగా సన్నద్ధమైన విద్యార్థులకు నిరాశే మిగులుతుంది. సంవత్సరం పాటు గంటల తరబడి చేసిన సాధన చూచిరాతల పరీక్షల ముందు ఓడిపోతుంది. తప్పులను ఆపాల్సిన అధికారులే దగ్గరుండి చూచి రాతలను ప్రోత్సహిస్తున్నారు ఎందుకంటే 100% ఉత్తీర్ణత రాకుంటే తను సంజాయిషీ ఇవ్వాల్సి వస్తుంది అని, తనకెందుకు ఈ అనవసరమైన తలనొప్పి అని. అందుకే విద్యార్థులు వాళ్ళ ఇష్టారీతిన పరీక్షలు రాసుకున్నా అడగడం లేదు ఎవరైనా నిబద్ధత కలిగిన అధికారి ఈ విషయంపై కఠినంగా ఉంటే మరుసటి రోజే అధికారిని మార్చి వేస్తున్నారు. ఒకప్పుడు కేవలం ఎస్ జి టి ఉపాధ్యాయులు మాత్రమే 10వ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్ గా ఉండేవారు ఒకవేళ అవసరం ఉంటే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్ గా పంపేవారు కానీ తను బోధించే సబ్జెక్ట్ టీచర్ ని ఇన్విజిలేటర్ గా పంపకుండా చూసుకునేవారు. కానీ ఇప్పుడు ప్రత్యేకంగా సబ్జెక్టులో మంచి పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులను ఇన్విజిరేటర్ గా నియమించడం జరుగుతుంది. ఇలాంటి చూచి రాతల పరీక్షలు ఎవరిని ఉద్ధరించడానికి ఇలాంటి ప్రక్రియ ద్వారా మనం విద్యార్థులకు మేలు చేస్తున్నామా లేక కీడు చేస్తున్నామా ఒకసారి ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది. ఉత్తీర్ణత శాతంలో మొదటి స్థానం లో ఉండడానికి జిల్లా స్థాయి అధికారులు ప్రయత్నిస్తున్నారు కానీ ఆ ఫలితాలను ఏ విధంగా ఏ విధంగా సాధిస్తున్నారు అనేది గమనించాల్సిన విషయం. ఇలాంటి చూచి రాతల పరీక్షల వలన విద్యార్థులు ఉపాధ్యాయుల అవసరంలేదనే నిర్ణయానికి వస్తున్నారు ఎలాగైనా చూసి పరీక్షలు రాసుకోవచ్చు ఎందుకు మనం ఇంకా స్కూల్ కి వెళ్లడం ఎందుకు కష్టపడడం ఎందుకు ఉపాధ్యాయుడిని కలవడం అనే భావన విద్యార్థులలో వస్తుంది. ఉపాధ్యాయులు కూడా నిస్సహాయులుగా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది.కొంతమంది విద్యార్థులు సంవత్సరం మొత్తం కష్టపడి పరీక్షలకు సన్నద్ధమే వస్తున్నారు. కానీ మొదటి పరీక్ష రాస్తున్నప్పుడు, పక్కన చూచిరాతల పరీక్షలను చూసి ఆ విద్యార్థులు మానసికంగా ఎంతో కృంగిపోతున్నారు. సంవత్సరం పాటు కష్టపడి చదివాను, తన కష్టం ఫలితం ఇంతేనా అని నిస్పృహకు గురవుతున్నారు.

**ఎటువంటి తప్పులు నైనా చేసి 100% ఫలితాలను సాధించాలని**

అనుకున్నాక ఇంకా ఈ 52 రోజుల ప్రణాళిక ఎందుకు స్పెషల్ క్లాస్ లు ఎందుకు స్క్వాడ్స్ ఎందుకు ఉన్నత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇలాంటి చూచిరాతల పరీక్షలకు స్వస్తి చెప్పాలి. ఉత్తీర్ణత శాతం కన్నా నాణ్యమైన విద్యా ఫలితాలను సాధించడానికి ప్రయత్నించాలి.

## విద్యా కమిషన్‌లోని అసంబద్ధ సిఫారసులను తొలగించాలి:నాగర్ కర్నూల్ జిల్లా టీచర్స్ జేఏసీ డిమాండ్





నిర్భయవార్త ప్రతినిధి :నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (మార్చి 3): నాగర్ కర్నూల్ జిల్లాలోని టీచర్స్ జేఏసీ, తెలంగాణ విద్యా కమిషన్ సమర్పించిన విధాన పత్రంలో ఉన్న అసంబద్ధ సిఫారసులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేసింది. కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించిన ఆకునూరి మురళి ఆధ్వర్యంలో రూపొందించిన ప్రతిపాదనల్లో కొన్ని అంశాలు ప్రభుత్వ విధానానికి ఉపయోగకరంగా ఉన్నప్పటికీ, అనేక సూచనలు ఆచరణ సాధ్యం కానివిగా ఉన్నాయని తీవ్రంగా ఆక్షేపించారు.మంగళవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ చైర్మన్ డి. సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కమిషన్ ప్రతిపాదించిన విధానాలపై విస్తృతంగా చర్చించారు.ప్రధాన అభ్యంతరాలు:మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఒక్క మండలంలో 3 లేదా 4 పాఠశాలలే ఉండాలనే ప్రతిపాదన గ్రామీణ విద్యార్థులకు విద్యను దూరం చేసే చర్యగా అభిప్రాయపడ్డారు.విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని 45% నుంచి 75%కు పెంచే ప్రతిపాదన విద్యార్థులపై మానసిక ఒత్తిడిని పెంచి, డ్రాప్‌అవుట్‌లు పెరిగే ప్రమాదం ఉందన్నారు.ఉపాధ్యాయ శిక్షణకు సంబంధించిన కొన్ని సూచనలు జాతీయస్థాయి నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఈ) నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.వివిధ ప్రవేశ పరీక్షలను రద్దు చేయడం కార్పొరేట్ విద్యా వ్యవస్థలకు ఊతమిచ్చే చర్యగా అభివర్ణించారు.ఒకే క్యాంపస్‌లో 1500 మందికి పైగా విద్యార్థులతో పాఠశాలలు నిర్వహించడం ఆచరణ సాధ్యం కాదన్నారు.ఉపాధ్యాయులను ఐదు సంవత్సరాల కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించి, ఆ తర్వాత పనితీరు ఆధారంగా కొనసాగింపు ఇవ్వాలనే ప్రతిపాదన అన్యాయమని విమర్శించారు.ఉపాధ్యాయుల వేతనాలు అధికమని తగ్గించాలని సూచించడం అసహేతుకమని పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేయాలనే ప్రతిపాదన తీవ్ర అన్యాయం అవుతుందని ముక్తకంఠంతో వ్యతిరేకించారు.విద్యా కమిషన్‌లోని పలు సిఫారసులు విద్యారంగాన్ని ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ, అసంబద్ధ సిఫారసులను తొలగించి తెలంగాణ ప్రజల, విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా విధానాలను పునర్విమర్శించాలని జేఏసీ డిమాండ్ చేసింది.ఈ సమావేశంలో జేఏసీ నాయకులు డాక్టర్ శ్రీధర్ శర్మ, బి.ఇ. విజయ్ కుమార్, బి. రాజారెడ్డి, గుడిపల్లి నిరంజన్, లక్ష్మణ్ నాయక్, సిహెచ్ వెంకట్, పచ్చిపాల సుబ్బయ్య, కూరాకుల ఆంజనేయులు, టి. రమేష్, కొంగరి జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్లకు 10వ తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాల తరలింపు



నిర్భయవార్త ప్రతినిధి : నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి మా (మార్చి 3): నాగర్ కర్నూలు జిల్లాలో ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షల ప్రశ్న పత్రాలు పేపర్1 ప్రశ్నపత్రాలను మంగళవారం పోలీస్ బందోబస్తు మధ్య జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. జిల్లాలో 60 కేంద్రాలు వాటిలో పదివేల10,658 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. జిల్లా విద్యాధికారి ఏ.రమేష్ కుమార్ పర్యవేక్షణలో చీఫ్ సూపర్డెంట్లు డిపార్ట్మెంట్ అధికారులు సమన్వయంతో ప్రశ్నాపత్రాల పంపిణీ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరీక్షలు నిర్వహణ అధికారి రాజశేఖర్రావు,ఎంఈఓ కుర్మయ్య, ప్రధానోపాధ్యాయులు తిరుపతయ్య, కృష్ణారెడ్డి, మండల విద్యాధికారులు తదితరులు ఉన్నారు.

# ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలి

## మానుక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి పత్రం



నిర్భయవార్త ప్రతినిధి :, జగిత్యాల ప్రతినిధి, మార్చి 03 : కోరుట్ల నియోజకవర్గంలోని మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో ఇటీవల ట్రాక్టర్ బోల్తావడి మరణించిన కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని కోరుతూ కోరుట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ మరణించిన వారి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. కోరుట్ల నియోజకవర్గం ఇటీవల మల్లాపూర్ మండలంలో మొగిలిపేట గ్రామ శివారులో ట్రాక్టర్ బోల్తా పడి మరణించిన పెద్దిరెడ్డి గంగు, వైష్ణవి, నంవంగి సాయవ్మ్మ, మంగళారపు లలిత కుటుంబాలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎందుకంటే వారు నిరుపేద కుటుంబాలని రెక్క ఆడితే కానీ డొక్కాడని కుటుంబాలు అని, అలాగే రోజు కూలి పని చేసుకుని బ్రతుకుతున్న నిరుపేద కుటుంబాలని ప్రవీణ్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా మంత్రికి అన్ని విషయాలు తెలియజేసి, మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున 20 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని ప్రవీణ్ కుమార్ కలెక్టర్ ను విజ్ఞప్తి చేసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎండి రఫీయోద్దీన్, మహదేవ్, మాధవరెడ్డి, మారుతి, మృతుల కుటుంబ సభ్యులు ఎల్లయ్య, ధర్మరాజు, గంగు, పోషవ్వ, గంగాధర్, రమేష్, శృతి, స్వాతి, సంజన పాల్గొన్నారు.



# హోలీ పండగ శుభాకాంక్షలు తెలిపిన

## –టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి



నిర్భయవార్త ప్రతినిధి :కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 3: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ హోలీ పండుగ, కామారెడ్డి నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో నరికొత్త వెలుగులు నింపాలని కోరుకుంటున్నాను. కులమతాలకు అతీతంగా, ప్రేమ అనురాగాలతో ఐక్యంగా ఈ రంగుల వేడుకను 14వ కుటుంబ



సభ్యులతో కలిసి చేసుకున్న టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

# కిషన్ రావు పేట ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు హోలీ వేడుకలు




నిర్భయవార్త ప్రతినిధి : ధర్మపురి నియోజకవర్గ ప్రతినిధి మార్చి 03 జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని కిషన్ రావు పేట ఉన్నత ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయులు నర్మల గంగన్న ఆధ్వర్యంలో ముందస్తు హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శీతాకాలం ముగిసి ప్రకృతి రంగుల పూలతో కలకలలాడే వసంత రుతువు ప్రారంభానికి సంకేతంగా ఈ హోలీ పండుగను భావిస్తారని ముఖ్యంగా ఈ హోలీ పండుగను సామాజిక ఐక్యతకు నిదర్శనంగా భావిస్తారని అందుకే ఇలాంటి కార్యక్రమాలు పాఠశాలలో చేపట్టడం ద్వారా విద్యార్థులందరూ కలిసిమెలిసి ఐక్యతగా స్నేహంగా ఉంటారని పాఠశాలకు మంగళవారం సెలవు రావడం తో ముందస్తుగా హోలీ పండుగను పాఠశాలలో ఈ రోజున జరిపామని అందుకే విద్యార్థులందరూ ఆనందంతో ఒకరికొకరు రంగులు పూసుకుంటూ , చల్లుకుంటూ ఉల్లాసంగా హోలీ పండుగను జరుపుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్మల గంగన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ గంగన్న ఉపాధ్యాయులు జి మునీంద్ర, సిహెచ్ వనిత, భవాని, శిరీష, జై సింగ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సత్యవతి, అంగన్వాడి టీచర్లు ఆయాలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# మరిపెడ మండలం లో ఘనంగా హోలీ వేడుక

## హోలీ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి మాజీ డోర్నకల్ ఎమ్మెల్యే డి ఎస్. రెడ్యా నాయక్





నిర్భయవార్త ప్రతినిధి : మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 3 మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని పలు గ్రామాలలో తండాలో ప్రజలు కుటుంబ సమేతంగా ఘనంగా హోలీ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగామాజీ మంత్రి, ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ హోలీ పండుగ విశిష్టతను వారు తెలియజేశారు. వందలాదిబంది కుటుంబ సభ్యులు మహిళలతో సహా, చిన్నపిల్లలతో రంగులు వేసుకుంటూ తమదైన శైలిలో శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా, తదుపరి ఆనందము ఐక్యతను స్వాగతించడానికి ఈ హోలీ పండుగను జరుపుకుంటారని వారు. ఈ పండుగ ప్రహ్లాదుడు హోలిక కథతో ముడిపడి ఉందని తెలిపారు. చాలా భారతీయ పండుగల మాదిరిగానే హోలీ కి కూడా ప్రకృతిలో లోతైన సంబంధాలు ఉన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు.

ఉగ్గంపల్లి సర్పంచ్ అయూబ్ పాషా,పదో వార్డ్ కౌన్సిలర్ బేబీ శ్రీ రవి, 11వ వార్డ్ కౌన్సిలర్ సత్యవతి యుగంధర్, 13వ వార్డ్ కౌన్సిలర్ మైపాల్ రెడ్డి,ఐదో వార్డ్ కౌన్సిలర్ బోడ భాస్కర్, మాజీ వార్డ్ కౌన్సిలర్ పరశురాం, పదో వార్డ్ మాజీ కౌన్సిలర్ హథిరాం నాయక్,సైదుల్, కాలనీవాసులు, యువత, మహిళలు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన టీఆర్ఎస్వి నాయకులు

నిర్భయవార్త ప్రతినిధి :బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 03: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో టీఆర్ఎస్వి బాల్కొండ నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హోలీ పండుగను పురస్కరించుకుని అంగరి రోహిత్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అంగరి రోహిత్ మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, హోలీ పండుగ సమాజంలో ఐక్యత, స్నేహభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. రంగుల పండుగను అందరూ ఆనందంగా, సౌహార్ద వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్వి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వీరశైవ లింగాయత్ అంబరాని అంటిన హోలీ సంబరాలు



పాల్గొన్న వీరేశలిం గాయతులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు, కార్యనిర్వాక అధ్యక్షులు అన్మిశెట్టి జయప్రకాశ్ మాట్లాడుతూ హోలీ పండుగ అంటే కేవలం రంగులను చల్లుకోవడం మాత్రమే కాదు. తోటి వారితో కలిసి నవ్వడం, తోటి వారి సుఖ సంతోషాలలో పాలుపంచుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో కోశాధికారి అమరాధి రాచన్న, జిల్లా ఉపాధ్యక్షులు వీర మహేందర్ అద్వకేట్ సమాజ సభ్యులు రాచప్ప రమేష్ రవి సురేష్ శేఖర్ శేఖర్ సతీష్ రవణప్ప షాబాద్ వీరన్న, మల్లేశం గౌరీశంకర్ విశ్వనాథ్ ప్రవీణ్లోకేష్ మల్లేశంవీరు,వైద్యనాథ్ నర్సింలనాగురాజుసమాజ సభ్యులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సదాశివపేట** నిర్భయవార్త ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో వీరశైవ లింగాయత్ సమాజం ఎడ్ల బజార్ బజార్ వారి ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహిం చారు అధ్యక్షులు గంధిగా రాజు మాట్లాడుతూ హోలీ సందర్భంగా ఉదయం నుండి కామ దహనం నుండి ప్రారంభమై భక్తి శ్రద్ధలతో సదాశివపేట లోని బసవేశ్వర మందిరం నుండి ప్రారంభమై బక్కప్ప మందిర్ సిందోల్ శంకర్ గృహము వరకు అక్కడనుండి దేశెట్టి బసవరాజు ఇంటి నుండి బసవేశ్వర మందిరం చేరుకోవడం జరిగింది, గతంలో పెద్దలు నిర్వహించే మాదిరిగా, ఈసారి కూడా ఈ కార్యక్రమం నిర్వహించామని అధ్యక్షులు అన్నారు, ప్రధాన కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో



# వాకర్స్ అసోసియేషన్ ఘనంగా హోలీ సంబరాలు





**సదాశివపేట,** నిర్భయవార్త ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా పట్టణంలో వాకర్స్ తాసిల్దార్ మనోహర్ చక్రవర్తి ఆధ్వర్యంలో మిత్రులతో కలిసి ఘనంగా హోలీ సంబరాలు చిన్న పిల్లలతో రాజశేఖర్ గౌడ్ కరుణ రెడ్డి పోలీస్ సతీష్ పటేల్ వెంకటేష్, సుధీర్, రఘునాథ్ రెడ్డి, సహదేవ్,సందీప్ రెడ్డి, రవి కుమార్ హోలీ సందర్భంగా ఉదయం నుండి కమదానం నుండి ప్రారంభమైన భక్తిశ్రద్ధలతో గతంలో పెద్దలు నిర్వహించే మాదిరిగా ఈసారి కూడా ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు కాలనీవాసులు చిన్నపిల్లలు తో ఘనంగా హోలీ సంబరాలు నిర్వహించారు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా సిత్రం



# రకుల్ పరవశం

**అవార్డు వేడుకలో బ్లూ డిజైన్ డ్రెస్‌లో సోయగం**

రకుల్ ప్రీత్ సింగ్ నటించిన 'దేదే ప్యార్ దే 2' సినిమాకి గాను బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే తాజాగా జీ సినీ అవార్డ్స్ 2026 వేడుకల్లో భాగంగా రకుల్ ప్రీత్ సింగ్ అవార్డు అందుకున్న క్షణాలకు సంబంధించిన ఫోటోలను తన ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. ఇందులో బ్లూ గ్లిటర్‌తో డిజైన్ చేసిన ఒక అందమైన డ్రెస్ ధరించి తన అందాలతో వేడుకకే స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది ఈ ముద్దుగుమ్మ. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన ఈ డ్రెస్ ఈమె అందాలను రెట్టింపు చేసింది. అసలే వైట్ స్కిన్ టోన్ దీనికి తగ్గట్టు బ్లూ డ్రెస్ ఇక ఈమె అందాలను ఏ విధంగా మార్చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొత్తానికైతే బ్లూ డ్రెస్ లో జీ సినీ అవార్డ్స్ వేడుకల్లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది రకుల్ ప్రీత్ సింగ్. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. రకుల్ ప్రీత్ సింగ్ విషయానికొస్తే.. ఒకప్పుడు సౌత్ సినిమాలలో నటించి భారీ పాపులారిటీ అందుకున్న ఈమె.. ముఖ్యంగా రామ్ చరణ్ , అల్లు అర్జున్, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోల సినిమాలతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది. కెరియర్ పీక్స్ లో ఉండగానే బాలీవుడ్ కి విచ్చేసిన ఈ ముద్దుగుమ్మ ఇక్కడే సినిమాలు చేస్తూ వచ్చింది. పైగా ప్రముఖ బాలీవుడ్ నటుడు జాకీ భగ్నానీతో ఏడడుగులు వేసి.. ఇప్పుడు అక్కడే సినిమాలు చేస్తూ.. తన భర్తతో కలిసి సినిమాలు నిర్మిస్తూ బిజీగా మారిపోయింది. ఇప్పుడు అవార్డు లభించడంతో తన ఆనందాన్ని అభిమానులతో పంచుకుంది.



# చీరకట్టులో స్పిరిట్ బ్యూటీ

**• హీట్ పెంచేస్తున్న త్రిప్తి**

బాలీవుడ్ సెన్సేషన్, నేషనల్ క్రష్ త్రిప్తి డిమ్రి తన అందచందాలతో మరోసారి ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఇవి పాత జ్ఞాపకాలుగా మారకముందే అప్‌లోడ్ చేస్తున్నాను అంటూ షేర్ చేసిన చీరకట్టు ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. సంప్రదాయబద్ధమైన లుక్‌లో కనిపిస్తూనే, తనదైన స్టైల్‌లో కుర్రాళ్ల హార్ట్ బీట్ పెంచేస్తోంది ఈ భామ. 'యానిమల్' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన ఈ బ్యూటీ, ఇప్పుడు తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియాలో తన అభిమానులను పలకరించడం త్రిప్తి మర్చిపోదు. తాజాగా ఆమె పోస్ట్ చేసిన చీరకట్టు ఫోటోలు ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారాయి. ఫ్యాషన్ డ్రెస్‌లో ఎంత బోల్డ్‌గా కనిపిస్తుందో, చీరలో అంతటి హొయలు ఒలికిస్తూ కుందనపు బొమ్మలా మెరిసిపోతోంది. ఇక ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు స్టన్నింగ్ బ్యూటీ అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. పాత జ్ఞాపకాలుగా మారకముందే తన అందాలను ఫ్యాన్స్‌కు షేర్ చేసి, మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది ఈ స్పిరిట్ బ్యూటీ



# స్లిమ్‌గా భాగ్యం

**కొత్త ఫోటోలతో గాలం**

కుర్రకారు క్రష్ గా మారిపోయిన భాగ్యశ్రీ బోర్సే ఈ మధ్యకాలంలో వరుస ప్రాజెక్టులలో బిజీగా మారుతూనే.. మరోవైపు తన అందాలతో ఎప్పటికప్పుడు లైమ్ లైట్ లో నిలుస్తోంది.. 2025లో గౌతం తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా నటించిన కింగ్డమ్ సినిమాలో హీరోయిన్ గా నటించి ఆకట్టుకున్న భాగ్యశ్రీ బోర్సే అదే ఏడాది రామ్ పోతినేని హీరోగా నటించిన ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాలో హీరోయిన్గా నటించింది. మహేష్ బాబు. ఈ సినిమాతో భారీ విజయాన్ని అందుకుంటుంది అనుకున్నారు కానీ పెద్దగా ఈమెకు సక్సెస్ లభించలేదు. తాజాగా స్లిమ్ డ్రెస్ వేసుకుని తన అందాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. భాగ్యశ్రీ షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి కుర్రకారు మాత్రమే కాదు సినీ ప్రియులు కూడా పరవశించిపోతున్నారు. అటు అమ్మాయి లు సైతం ఈమె లుక్కు చూసి వావ్ అంటూ కామెంట్లు చేస్తూ ఉండడం గమనార్హం. ముఖ్యంగా కొంతమంది ఫైర్ ఏమోజీ లతో పాటు హార్ట్ ఎమోజిలు అలాగే లవ్ ఎమోజీలను షేర్ చేస్తూ.. నా మనసు దోచేశావు అంటూ మీమ్స్ కూడా షేర్ చేస్తున్నారు.

# చూపులతో కాటేస్తున్న నిధి

'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో మాస్ ఆడియెన్స్ ను తన గ్లామర్‌తో కట్టిపడేసిన బ్యూటీ నిధి అగర్వాల్. వెండితెరపై తనకంటూ ఓ ప్రత్యేకమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ, సోషల్ మీడియాలోనూ అంతే యాక్టివ్‌గా ఉంటారు. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట హీట్ పుట్టిస్తున్నాయి. ప్రముఖ డిజైనర్ తరుణ్ తహల్యాని డిజైన్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్‌లో నిధి అగర్వాల్ స్టన్నింగ్‌గా కనిపిస్తున్నారు. ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో నిధి నలుపు రంగు డ్రెస్ లో నెవ్వర్ బిఫోర్ అనేలా దర్శనమిచ్చారు. ముఖ్యంగా ఆ డ్రెస్‌కు ఉన్న కోర్సెట్ స్టైల్ బ్లౌజ్, దానిపై ఉన్న మెరిసే వర్క్ ఆమె గ్లామర్‌ను రెట్టింపు చేసింది. మోడ్రన్ గౌన్‌లా ఉన్న ఈ డ్రెస్ డిజైన్ ఆమె పర్ఫెక్ట్ గ్లామర్ ను ఎలివేట్ చేస్తోంది. స్టైలింగ్ విషయంలోనూ నిధి చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. హెవీ జ్యువెలరీ జోలికి వెళ్లకుండా, కేవలం నలుపు రంగు హ్యాంగింగ్ ఇయర్ రింగ్స్ ధరించి చాలా క్లాసీగా రెడీ అయ్యారు. జుట్టును లూజ్‌గా వదిలేసి, మినిమల్ మేకప్‌తో తన న్యాచురల్ అందాన్ని హైలైట్ చేశారు. కెమెరా వైపు ఆమె చూస్తున్న తీరు, ఆ కాన్ఫిడెన్స్ చూస్తుంటే 'పర్ఫెక్ట్' లుక్ అంటే ఇదేనేమో అనిపిస్తుంది.



Nidhhi Agerwal

# పరికిణీలో సుందరవల్లి

**అందాలతో నభా విందు**

నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన గ్లామర్ బ్యూటీ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం , అభినయంతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న ఈమె.. ఈ ఏడాది ఎలాగైనా సరే పాన్ ఇండియా స్టార్ డంను సొంతం చేసుకోవాలని గట్టిగా ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగానే స్వయంభు తో పాటు నాగబంధం అనే రెండు విభిన్న జానర్లలో సినిమాలు చేస్తోంది. పైగా ఈ రెండు చిత్రాలు కూడా పాన్ ఇండియా వైడ్ రిలీజ్ కాబోతున్న నేపథ్యంలో ఈ సినిమాలపై అంచనాలు మరింత పెరిగాయనే చెప్పాలి. ఒకవైపు ఈ సినిమాల బిజీ షెడ్యూల్లో పాల్గొంటూనే మరొకవైపు ఇంస్టాగ్రామ్ వేదికగా తమ సినిమాలపై అంచనాలు పెంచే ప్రయత్నం చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే ఇంస్టాగ్రామ్ వేదికగా రోజుకొక గెటప్ లో అభిమానులను ఆకట్టుకుంటుంది. తాజా గా లైట్ ఆరెంజ్ లంగా వోణి ధరించిన ఈమె రాధా గెటప్ లో ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా నభా నటేష్ ఈ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరుకు అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా రాధా గెటప్లో సుందరవల్లి అందాలు అదర హో అంటూ కామెంట్లు చేస్తున్నారు.ఇలా తన అందంతో అభిమానులను ఆకట్టుకోవడంతో కృష్ణుడికై వేచిచూసే రాధా గెటప్లో నభా అద్భుతంగా ఉంది అంటూ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197